బిఎడ్ కౌన్సిలింగ్ 31 వరకు పొడిగింపు

ప్రజాశక్తి-అమరావతి

బిఎడ్ తొలి విడత కౌన్సిలింగ్ గడువు ఈ నెల 31 వరకు పొడించాలని ఉన్నత విద్యా మండలికి హైకోర్టు ఆదేశించింది. హైకోర్టుకు వచ్చిన బిఎడ్ కాలేజీలను కౌన్సిలింగ్ జాబితాలో చేర్చాలని పేర్కొంది. ఈ మేరకు జస్టిస్ కె.మన్మథరావు శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులి చ్చారు. 25 వరకు మాత్రమే ఉన్న కౌన్సెలింగ్‌ను పొడిగించేలా ఉత్తర్వులు ఇవ్వాలని విద్యార్థులు, తమ కాలేజీలను కౌన్సిలింగ్ జాబితాలో చేర్చాలని పలు బిఎడ్ కాలేజీలు వేర్వేరుగా వేసిన రిట్లను శుక్రవారం హైకోర్టు విచారణ జరిపింది. విచార ణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

PRAJASAKTI Regd.No. 15795/68


ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 176 | విజయవాడ, శనివారం 28 జనవరి 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 28 January 2023 | Rs



వెండితెర సత్యభామ ఇకలేరు..

జమున మృతితో తెలుగునాట విషాదం

హైదరాబాద్‌లో అంత్యక్రియలు పూర్తి

ప్రజాశక్తి ప్రతినిధి - హైదరాబాద్

రెండు దశాబ్దాల పాటు వెండితెరను ఏలిన అభినయ తార రాలిపోయింది! చలాకీ చిన్నదిగా, సత్యభామగా అభిమానుల మనసులు దోచిన వన్నెల దొరసాని వెళ్లిపోయింది. ప్రజానాట్యమండలి వేదికపై ప్రభవించి, సినీరంగంలో విశేషంగా రాణించిన జమున (86)కన్నుమూశారు. కొద్దిరోజులుగా వృద్ధాప్య కారణాలతో అస్వస్థతతో ఉన్న ఆమె హైదరాబాదులోని తన నివాసంలో బుధవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. అభిమానుల సందర్శనార్థం ఆమె భౌతిక కాయాన్ని ఫిలింనగర్‌లోని ఫిలిం ఛాంబర్స్ అసోసియేషన్ భవనం వద్ద ఉంచారు. అభిమానుల అశ్రునివాళుల మధ్య సాయంత్రం జూబ్లీ హిల్స్‌లోని మహాప్రస్థానానికి తరలించి, అక్కడ అంత్యక్రియలు నిర్వహించారు. కుమార్తె స్రవంతి తల్లి చితికి నిప్పంటించారు.

జమున మరణంతో ఒకనాటి మేటి తారల తరం ముగిసినట్టయింది. అందానికి, అభినయానికి, ఆత్మగౌరవానికి పెట్టింది పేరైన జమున ... దాదాపు 200 సినిమాల్లో నటించారు. అనేక సినిమాల్లో అపురూపమైన పాత్రలు పోషించి, ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేశారు. తన రీవికి, స్వభావానికి అనువుగా ఉన్న కథానాయిక పాత్రలనే పోషించాలని నియమం పెట్టుకున్న జమున ... వయసు పెరిగాక క్యారెక్టరు ఆర్టిస్టుగా అవకాశాలొచ్చినా అంగీకరించలేదు.

జమున... 1936 ఆగస్టు 30న నిప్పని శ్రీనివాసరావు, కౌసల్యాదేవి దంపతులకు హంపీలో జన్మించారు. సినిమాల్లోకి రాకముందు ఆమె పేరు జానాబాయి. సినిమా తెరపై సౌలభ్యంగా ఉంటుందని ఆ పేరును జమునగా మార్చారు. తండ్రి వ్యాపార రీత్యా.. గుంటూరు జిల్లా దుగ్గిరాలలో స్థిరపడ్డారు. జమున బాల్యమంతా అక్కడే గడిచింది. తల్లి దగ్గరే సంగీతం, హార్మోనియం నేర్చుకున్నారు. అప్పట్లో ప్రజానాట్యమండలి 'మాభూమి' తదితర నాటకాలను విస్తృతంగా ప్రదర్శించేది. చలాకీ జమునకు నటించటం అంటే ఇష్టం. ఆ ఇష్టాన్ని గమనించిన ప్రజానాట్య మండలి 'మాభూమి'లో కమల పాత్రకు ఆమెను ఎంపిక చేసింది. ఆవిధంగా ఆమె రంగస్థలానికి పరిచయమయ్యారు. అలవోకగా సంభాషణలు పలుకుతూ, చురుగ్గా నటిస్తున్న జమునను ప్రజానాట్యమండలి వ్యవస్థాపకులు డాక్టర్ గరికపాటి రాజారావు గుర్తించి, మరింత మంచి నటిగా తీర్చిదిద్దారు. ఆయన 1953లో నిర్మించి, దర్శకత్వం వహించిన పుట్టిల్లు సినిమాలో అవకాశం ఇచ్చారు. అలా జమున వెండితెరకు పరిచయమయ్యారు. ఆ ప్రారంభ ఉత్సాహ ప్రోత్సాహాలను, ప్రజానాట్యమండలిని ఆమె ఎప్పుడూ మర్చిపోలేదు. ప్రతి ఇంటర్వ్యూలోనూ ప్రజానాట్యమండలిని, డాక్టర్ గరికపాటిని గుర్తు చేసుకునేవారు. ప్రజానాట్యమండలి పునరుద్ధరణ సమయంలోనూ తన సహకారం అందించారు. 1965లో ప్రొఫెసర్ జూలూరి రమణారావుతో జమునకు వివాహం జరిగింది. వారికి కుమారుడు వంశీ, కుమార్తె స్రవంతి ఉన్నారు. రమణారావు తొమ్మిదేళ్ల క్రితం (2014 నవంబరు 10) గుండెపోటుతో మరణించారు.

రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, జగ్గయ్య వంటి అలనాటి అగ్రహీరోల సరసన కథా నాయికగా నటించారు. శ్రీ కృష్ణ తులాభారం చిత్రంలోని సత్యభామ పాత్ర ఆమెకు బాగా పేరు తెచ్చింది. సత్యభామలోని సాహసం, చొరవ, పొగరు, అలక, ఉక్రోశం ... వంటి హావభావాల అభినయం జమునకే సాధ్యమని అందరూ అనుకునేంతగా ప్రసిద్ధి పొందారు. జమున తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో మొత్తం 198 సినిమాల్లో నటించారు. ఇందులో తెలుగు చిత్రాలు 145 కాగా, తమిళం 20, కన్నడం 7, హిందీ 10 చిత్రాలు. 1959 నుంచి సావిత్రితో పాటే వెండితెర వైభవాన్ని చూశారు.

1964లో విడుదలైన మూగ మనసులు సినిమాలకు గాను ఉత్తమ సహాయ నటిగా ఫిలింఫేర్ అవార్డు అందుకున్నారు. 1968లో మరోసారి ఉత్తమ సహాయ నటిగా ఎంపికయ్యారు. మిలాన్ చిత్రంలో గౌరీ పాత్రకు బాలీవుడ్ ఫిల్మ్‌ఫేర్ లభించింది. 2008లో ఎన్టీఆర్ జాతీయ పురస్కారం అందుకున్నారు. చెన్నై నుంచి హైదరాబాద్ వచ్చిన తొలితరం నాయిక జమున. భర్త, పిల్లల కోసం ఆమె తన మకాం హైదరాబాద్ బంజారాహిల్స్‌కు మార్చారు. నాటి ప్రధాని ఇందిరాగాంధీ ఆహ్వానంతో 1980లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. 1985లో మంగళగిరి నుంచి పోటీచేసి ఓడిపోయారు. 1989లో రాజమండ్రి నుంచి కాంగ్రెస్ ఎంపీగా గెలుపొందారు. 1991 ఎన్నికల్లో ఓటమి చవిచూశారు. తరువాత ప్రత్యక్ష రాజకీయాలకు పూర్తిగా దూరమయ్యారు.



డిజిటల్ హెల్త్ సర్వీస్ అంశంలో వచ్చిన అవార్డులను చూపుతున్న సిఎం జగన్మోహన్‌రెడ్డి, మంత్రి రజని, అధికారులు

మార్చి 1 నుండి ఆస్పత్రుల సందర్శన

- సమీక్షలో సిఎం
- త్వరలో ఆరోగ్యశ్రీ యాప్ ప్రారంభం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మార్చి ఒకటవ తేది నుండి రాష్ట్ర వ్యాప్తంగా ఆస్పత్రుల సందర్శన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖపై కార్యాలయంలో ఆయన శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎల్‌ఏలు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతారని, ఎక్కడికక్కడ ప్రభుత్వ ఆస్పత్రులను సందర్శించి లోటుపాట్లను పరిశీలిస్తారని చెప్పారు. ఆ రోజు నుండే ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అమలులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. అదే రోజు క్యాన్సర్ నివారణా పరికరాలతో పాటు క్యాథల్యాబ్స్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రజారోగ్య వ్యవస్థలో దేశానికి రాష్ట్రం ఆదర్శంగా నివాలని తెలిపారు. మందులకు కొరత ఉందన్న మాట వినబడకూదన్నారు. గ్రామస్థాయిలోనే ఎనీమియా లాంటి కేసులు గుర్తించి వారికి ఆరోగ్యానికి చర్యలు తీసుకోవాలని వివరించారు. కిడ్నీ వ్యాధులతో ప్రజలు బాధపడుతున్న ప్రాంతాలపై ప్రత్యేకశ్రద్ధ పెట్టాలన్నారు. ఉద్దానంలో కిడ్నీ వ్యాధిని నివారించడానికి రూ.700 కోట్లు ఖర్చు పెడుతున్నట్లు తెలిపారు. పాలకొండ ప్రాంతంలో కూడా మరో రూ.265 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. పలాసలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్, ఆస్పత్రిని నిర్మిస్తున్నామని, తాగునీటి మిగతా 2లో

యువత కోసం ప్రత్యేక మ్యానిఫెస్టో

లోకేష్ ప్రకటన ● ప్రారంభమైన యువగళం పాదయాత్ర



ప్రజలకు అభివాదం చేస్తూ...

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

యువత కోసం ప్రత్యేక మ్యానిఫెస్టో ప్రకటించి టిడిపి అధికారంలోస్తే అమలు చేస్తామని నారా లోకేష్ ప్రకటించారు. యువగళం పాదయాత్రను శుక్రవారం ఆయన ప్రారంభించారు. తన తండ్రి చంద్రబాబునాయుడు నియోజకవర్గమైన కుప్పంలోని లక్ష్మీపురం వరదరాజగుడి వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి శుక్రవారం ఉదయం 11.03 గంటలకు పాదయాత్ర తొలి అడుగు వేశారు. ఈ యాత్ర 400 రోజులపాటు నాలుగు వేల కిలోమీటర్లు సాగనుంది. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ముగియనుంది. తొలిరోజు లక్ష్మీపురం నుంచి ప్రారంభమైన పాదయాత్ర పట్టణంలోని పిఇఎస్ మెడికల్ కళాశాల వరకూ ఎనిమిది కిలోమీటర్లు సాగింది. అనంతరం కమతం రోడ్డులో సాయంత్రం నాలుగు గంటలకు భారీ బహిరంగ సభ జరిగింది. ఈ సభలో ఆయన మాట్లాడుతూ 'యువగళం... మన గళం. అదే ప్రజాబలం. నట సార్వభౌముడు ఎన్‌టిఆర్ తెలుగుజాతి కోసం చైతన్యరథమెక్కారు. ఆంధ్రా ప్రజల కోసం 'వస్తున్నా మీకోసం' అంటూ నారా చంద్రబాబునాయుడు పాదయాత్ర చేపట్టారు. యువత కోసం యువగళం పేరుతో నేను పాదయాత్ర తొలి అడుగు వేశాను. అని నారా లోకేష్ అన్నారు. ఎన్ని అడ్డుకులు సృష్టించినా యువగళం యాత్రగానీ, పవన్ కల్యాణ్ చేపట్టనున్న వారాహి యాత్రగానీ ఆగదని తేల్చి చెప్పారు. జిఒ-1 బూచిచూపి యువగళం యాత్రకు అడ్డు తగిలితే తొక్కుకుంటూపోతామని హెచ్చరించారు. ఏ హక్కుతో తాను పాదయాత్ర చేస్తున్నానని కొంతమంది మంత్రులు పిచ్చికూతలు చూస్తున్నారన్నారు. 'నేను పంచాయతీ రాష్ట్ర శాఖ మంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రంలో 25 వేల కిలోమీటర్లు సిసి రోడ్లు వేయించాను. 25 లక్షల ఎల్ఇడి లైట్లు వేయించాను. రూ.25 వేల కోట్లతో పేదలకు ఇంటింటికీ తాగునీటి సౌకర్యం కల్పించాను' అని తెలిపారు. ఈ మూడున్నరేళ్ల కాలంలో ఈ మంత్రులు ఏం చేశారో సమాధానం చెప్పాలన్నారు. 'జగన్ ప్రభుత్వం పోవాలి. సైకిల్ పాలన రావాలి' అనేది పాదయాత్ర ఉద్దేశమని తెలిపారు. పలు హామీలు గుప్పించారు. 'జె' ట్యాక్స్ పేరుతో రాష్ట్రంలోని పరిశ్రమలు వెళ్లిపోయాయని, కొత్తగా పెట్టుబడులు పెట్టేందుకు ఏ పరిశ్రమలూ రావడం లేదని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వలసెళ్లిన పరిశ్రమలన్నింటినీ మిగతా 2లో

తొలి రోజు ఇలా..

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, మామ నందమూరి బాలకృష్ణ, బావ నందమూరి తారకరత్న, మాజీ మంత్రులు అమరనాథరెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కళా వెంకట్రావు, కొల్లు రవీంద్ర, నక్కా ఆనందబాబు తదితరుల సారథ్యంలో తొలి రోజూ యాత్ర ప్రారంభమైంది. ఎన్‌టిఆర్‌కు, అంబేద్కర్ విగ్రహాలకు లోకేష్ పూలమాలలు వేశారు. చర్చి, మసీదుల్లో ప్రార్థనలు చేశారు.

లోపలి పేజీల్లో...

నందమూరి తారకరత్నకు తీవ్ర గుండెపోటు

మా బంగారం ఉందో? లేదో? చెప్పండి

- యూనియన్ బ్యాంకును ముట్టడించిన రైతులు, ఖాతాదారులు

లోపలి పేజీల్లో...

ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలోని లోపాలను సరిచేయండి

- ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక

ఎయులో బిబిసి డాక్యుమెంటరీ ప్రదర్శన

- అడ్డుకునేందుకు ఎబివిపి యత్నం
- తరిమికొట్టిన విద్యార్థులు


ప్రజాశక్తి - విశాఖపట్నం

బిబిసి మోడీపై రూపొందించిన 'ఇండియా - ది మోడీ క్వశ్చన్' డాక్యుమెంటరీని ఎస్‌ఎఫ్ఐ ఎయు కమిటీ ఆధ్వర్యంలో ఆంధ్ర యూనివర్సిటీలోని శాతవాహన హాస్టల్ సమీపంలో శుక్రవారం రాత్రి 9 గంటల నుంచి ప్రదర్శించారు. చలిలో సైతం విద్యార్థులు హాజరై వీక్షించారు. డాక్యుమెంటరీ ప్రదర్శన విషయాన్ని తెలుసుకున్న ఎబివిపి నాయకులు అక్కడకు చేరుకుని ప్రదర్శనను నిలిపివేయాలని గొడవకు దిగారు. అక్కడున్న విద్యార్థులంతా 'గో బ్యాక్ ఎబివిపి' అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ వారిని తరిమికొట్టారు. అనంతరం పోలీసులు డాక్యుమెంటరీని ప్రదర్శించిన విద్యార్థులపై బెదిరింపులకు దిగారు. అయినా డాక్యుమెంటరీ ప్రదర్శన కొనసాగింది. అడ్డుకోవడానికి ప్రయత్నించిన ఎబివిపి చర్యను ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె ప్రసన్న కుమార్, కార్యదర్శి అశోక్ తీవ్రంగా ఖండించారు.

'అదానీ' ప్రకంపనలు

- రెండు రోజుల్లో 10.65 లక్షల కోట్ల ఆవిరి
- ఎల్ఐసికి రూ.18 వేల కోట్ల నష్టం
- అయినా రూ.300 కోట్ల మళ్లింపు

న్యూఢిల్లీ : స్టాక్ మార్కెట్లో అదాని గ్రూపు ప్రకంపనలు కొనసాగుతున్నాయి. అదాని సంస్థ మోసపూరిత చర్యలకు పాల్పడుతోందని, మనీ లాండరింగ్ చేస్తోంటూ అమెరికన్ సంస్థ హిండెన్‌బర్గ్ ఇచ్చిన పరిశోధనాత్మక నివేదికతో భారత మార్కెట్లు విలవిలలాడుతున్నాయి. రెండు రోజుల్లో 10.65 లక్షల కోట్ల రూపాయల సంపదను ముదుపర్లు కోల్పోయారు. అదానీకి చెందిన 10 లిస్టెడ్ కంపెనీల మార్కెట్ కాపిటలైజేషన్ రూ.4 లక్షల కోట్లు ఆవిరయింది. శుక్రవారం ఒక్కరోజో ఈ సంస్థలు మూడు లక్షల కోట్ల రూపాయల మేర నష్టం చవిచూశాయి. జనవరి 24న అదానీ గ్రూపు కంపెనీల మార్కెట్ కాపిటలైజేషన్ విలువ రూ19 లక్షల కోట్లుగా ఉండగా.. జనవరి 27 ముగింపు నాటికి రూ.15 లక్షల కోట్లకు పరిమితమయ్యింది. అదానీ షేర్లలో అమ్మకాల వల్ల ఎల్ఐసి దాదాపు రూ.18వేల కోట్ల నష్టాన్ని చవిచూసింది. అదానీ గ్రూపులోని కంపెనీల్లో జనవరి 24 నాటికి ఎల్ఐసి పెట్టుబడి రూ.81,268 కోట్లుగా ఉండగా.. 27 నాటికి ఇది రూ.62,621 కోట్లకు పడిపోయింది. ఇంత భారీ నష్టం జరిగినా ఎల్ఐసి నుండి మరో 300 కోట్ల రూపాయలను అదాని గ్రూపునకు మళ్లించడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమౌతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అదాని ఎంటర్‌ప్రైజెస్ కొత్తగా విడుదల చేయనున్న ఎఫ్‌పిఓలో ఎల్ఐసి ఈ మేరకు పెట్టుబడులు పెట్టనుందని సమాచారం. దీంతో అదాని గ్రూపులో ఎల్ఐసి పెట్టుబడులు మరో 4.23శాతం మేర పెరగనున్నాయి. సంక్షోభం వేళ ఈ స్థాయిలో పెట్టుబడులు పెట్టడానికి ప్రభుత్వ రంగ సంస్థయైన ఎల్ఐసి సిద్ధపడటం వెనుక ప్రభుత్వ వర్గాల ఒత్తిడి ఉందని భావిస్తున్నారు. అదానీ ఎంటర్‌ప్రైజెస్ చేపట్టిన రూ.20,000 కోట్ల ఎఫ్‌పిఓ శుక్రవారం ప్రారంభమైంది. ఇది జనవరి 31 వరకు కొనసాగనుంది. ఎఫ్‌పిఓలో ఒక్కో షేరును రూ.3,112 - రూ.3,276 ధరల శ్రేణిలో విక్రయించాలని నిర్ణయించారు. తాజా పరిణామాల నేపథ్యంలో ప్రస్తుతం షేరు ధర ఎఫ్‌పిఓ ధర కంటే కిందకు చేరి రూ.2,768 వద్ద నమోదవుతోంది. అ



కుబేర స్థానం పతనం

హిండెన్‌బర్గ్ రిపోర్ట్ దెబ్బకు అత్యంత కుబేరుడైనా గౌతం అదానీ సంపద కీలకమైన 100 బిలియన్ల మార్క్‌కు దిగువకు పడిపోయింది. రెండు రోజుల్లో ఆయన కంపెనీల షేర్ల పతనంతో ప్రపంచ సంపన్నుల జాబితాలో అదానీ ర్యాంకింగ్ ఏడో స్థానానికి పడిపోయింది. ఇంతక్రితం ఆయన నాలుగో స్థానంలో ఉన్నారు. కొన్ని నెలల క్రితం ఓ దశలో రెండో స్థానానికి ఎగబాకగా.. చాలా కాలం మూడో స్థానంలో కొనసాగారు.

రెండు సెషన్లలో అదానీ షేర్ల పతన తీరు

అదానీ ఎంటర్‌ప్రైజెస్	-19.77%
అదానీ పోర్ట్స్	- 21.58%
అదానీ విల్మర్	-9.74%
అదానీ గ్రీన్	-22.46%
అదానీ పవర్	-9.72%
అదానీ ట్రాన్స్‌మిషన్	-27.08%
అదానీ టోటల్	-24.76%
ఎసిసి	-19.52%
అంబూజా సిమెంట్	-23.75%

కేంద్రాన్ని ఎందుకు ఎదిరించరు?

'విశాఖ ఉక్కు'పై రాష్ట్ర ప్రభుత్వానికి బివి రాఘవులు ప్రశ్న

జిఓ నెం.1ని ఉపసంహరించాలని డిమాండ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బివి రాఘవులు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ ఉక్కును ప్రైవేటీకరించి తీరుతామని చెబుతున్న కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర సర్కారు గట్టిగా ఎందుకు ఎదిరించడం లేదని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి రాఘవులు ప్రశ్నించారు. విశాఖ జగదాంబ సమీపంలోని సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడుతో కలిసి శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కార్మికులు, ప్రజలు రెండేళ్లుగా పోరాడుతున్నా కేంద్రం మొండిపట్టుతో ప్రయివేటీకరణ చేసి తీరతామని చెప్తుండటం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వ ఈ వైఖరిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాల్సిఉందని చెప్పారు. ఈ నెల 30న విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ భారీ ఎత్తున నిర్వహిస్తున్న 'ప్రజా గర్జన'కు సిపిఎం, వామపక్షాలు మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనకు ప్రత్యేక హోదా సాధన కమిటీ, యువజన, విద్యార్థి సంఘాలు నిర్వహిస్తోన్న రాష్ట్ర వ్యాప్త యాత్ర వచ్చే నెల మొదటి వారంలో ఉత్తరాంధ్రకు రానుందని, ఈ యాత్రకుకూడా సిపిఎం సంపూర్ణ మద్దతు, సహకారం అందిస్తుందన్నారు. జిఒ నెంబరు 1ని తీసుకొచ్చి ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యమాలను నిలువరించే ప్రయత్నం వైసిపి ప్రభుత్వం చేస్తోందని విమర్శించారు.. తక్షణమే జిఒ నెంబరు 1ని ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. గణతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర గవర్నర్ తన ప్రసంగంలో 43 నెలల్లో రాష్ట్రంలో గ్రామ స్వరాజ్యం తెచ్చినట్లు చెప్పారని, వాస్తవానికి పంచాయతీలను విధులు, నిధులు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు.

రాజ్యాంగ విలువలు ధ్వంసం

కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం రాజ్యాంగ విలువలను ధ్వంసం చేస్తోందని బి.వి.రాఘవులు చెప్పారు. . గుజరాత్‌లో మోడీ పాలనలో జరిగిన ఘోర అకృత్యాలను బిబిసి డాక్యుమెంటరీ విడుదల చేస్తే కేంద్రం దీనిని నిషేధించడం శోచనీయమన్నారు. ఈ డాక్యుమెంటరీ ప్రదర్శనకు అనుమతించాలని డిమాండ్ చేశారు. భావ ప్రకటనా స్వేచ్ఛపై ఆంక్షలు సరికాదన్నారు. రాజ్యాంగ విలువల పరిరక్షణకు దేశభక్తులంతా కలిసి రావాలని రాఘవులు కోరారు. గతంలో మీడియా ప్రతినిధులను, మేధావులను అరెస్టులు చేసి జైళ్లలో పెట్టారని గుర్తు చేశారు. ఇప్పటికీ ఆ కేసులు నడుస్తున్నాయన్నారు. దేశభక్తి అంటే దేశ రాజ్యాంగాన్ని, వ్యక్తి స్వేచ్ఛను కాపాడుకోవడమేనని పేర్కొన్నారు. ఐక్య ఉద్యమాలతో ఫాసిస్టు తరహా చర్యలను అడ్డుకోవాలన్నారు.

త్రిపురలో ఎర్ర జెండాల హోరు

- వివిధ అసెంబ్లీ స్థానాల్లో నామినేషన్లు దాఖలు చేసిన సిపిఎం అభ్యర్థులు
- వేలాది మంది కార్యకర్తలు, మద్దతుదారులతో ర్యాలీలు



లెఫ్ట్‌ఫ్రంట్ అభ్యర్థుల విజయాన్ని కోరుతూ సబరూమ్‌లో సిపిఎం భారీ ర్యాలీ

అగర్తల: అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్లు వేసిన వామపక్ష అభ్యర్థులకు మద్దతుగా వేలాది మంది తరలిరావడంతో శుక్రవారం త్రిపురలో వీధులు ఎర్ర జెండాలతో నిండిపోయాయి. ఫిబ్రవరి 16న జరిగే ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమయింది. శుక్రవారం అనేక అసెంబ్లీ స్థానాల్లో సిపిఎం అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో సిపిఎం కార్యకర్తలు, మద్దతుదారులు, ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎర్రె జెండాలతో వీధులు నిండిపోయాయి. సబరూమ్‌లో లెఫ్ట్‌ఫ్రంట్ అభ్యర్థుల విజయాన్ని కోరుతూ జరిగిన ప్రదర్శనలో వేలాది మంది ఎ ర్రజెండాలతో పాల్గొన్నారు. ఈ ప్రదర్శనకు సిపిఎం త్రిపుర రాష్ట్ర కార్యదర్శి జితేంద్ర చౌదరీ కూడా హాజరయ్యారు. త్రిపురలో మొత్తం 60 అసెంబ్లీ స్థానాలు ఉండగా, 47 స్థానాల్లో లెఫ్ట్ ఫ్రంట్ అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. ఇందులో 43 స్థానాల్లో సిపిఎం పోటీ చేస్తుంది. ఈ మేరకు ఇటీవలే అభ్యర్థుల జాబితాను పార్టీ ప్రకటించింది. కాంగ్రెస్ పోటీ చేస్తున్న 13 స్థానాల్లో మిగతా 2లో

'టిటిడి దేవస్థానమ్' మొబైల్ యాప్ ప్రారంభం

ప్రజాశక్తి- తిరుమల

తిరుమల తిరుపతి దేవస్థానమ్ మొబైల్ యాప్‌ను టిటిడి చైర్మన్ వైవి సుబ్బారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. దర్శన టికెట్లు, సేవా టికెట్ల బుకింగ్‌తోపాటు సమస్త సమాచారం అందులో నిక్షిప్తమై ఉంటుందని ఆయన తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ భక్తుల కోసం ఇప్పటివరకూ గోవింద మొబైల్ యాప్ ఉండేదని, దీన్ని మరింత ఆధునీకరించి మరిన్ని అప్లికేషన్లు పొందుపరచి నూతన యాప్ రూపొందించామని చెప్పారు. ఈ మొబైల్ యాప్ ద్వారా భక్తులు తిరుమల శ్రీవారి దర్శనం, సేవలు, వసతి, అంగప్రదక్షిణ, సర్వదర్శనం, శ్రీవారి సేవ బుక్ చేసుకోవచ్చని తెలిపారు. విరాళాలు సైతం ఈ యాప్ నుంచి అందించవచ్చన్నారు. జియో సంస్థ సహకారంతో టిటిడి ఐటి విభాగం ఈ యాప్‌ను రూపొందించినట్లు చెప్పారు. టిటిడి ఇఒ ఎవి.ధర్మారెడ్డి మాట్లాడుతూ కొత్త యాప్‌ను లాగిన్ అయ్యేందుకు యూజర్ నేమ్‌తోపాటు ఒటిపి ఎంటర్ చేస్తే చాలని, పాస్‌వర్డ్ అవసరం లేదని తెలిపారు. డిజిటల్ గేట్ వేగా ఈ యాప్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.


జస్టిస్ జోతిర్మయి   జస్టిస్ గోపాలకృష్ణారావు

అదనపు జడ్జిల ప్రమాణం

ప్రజాశక్తి-అమరావతి

న్యాయాధికారుల కోటా నుంచి ప్రతాప వెంకట జోతిర్మయి, వెణుతరుమల్లి గోపాలకృష్ణారావు హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా శుక్రవారం ప్రమాణం చేశారు. ఫస్ట్ కోర్టు హాల్లో చీఫ్ జస్టిస్ పికె కుమార్ మిశ్రా వారితో ప్రమాణం చేయించారు. వాళ్ల నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేరిట వెలువడిన ఉత్తర్వులను రిజిస్ట్రార్ జనరల్ వై.లక్ష్మణరావు చదివి వినిపించారు. దైవసాక్షిగా ప్రమాణం చేశారు. తర్వాత జస్టిస్ జోతిర్మయి చీఫ్ జస్టిస్‌తో, జస్టిస్ గోపాల కృష్ణారావు జస్టిస్ రవినాథ్ తిల్హారితో కలిసి కేసులను విచారించారు. వీరి రాకతో హైకోర్టు న్యాయమూర్తుల సంఖ్య 32కు చేరింది. ఐదు పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.



సిఎం, గవర్నర్లతో రక్షక దళ కమాండర్ భేటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌ను, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తూర్పు తీర రక్షక దళ కమాండర్, అడిషనల్ డైరెక్టర్ జనరల్ శివమణి పరమేష్ శుక్రవారం విడివిడిగా కలిశారు. రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను, తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయంలో జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తూర్పు సముద్రతీరంలో సముద్ర భద్రతకు సంబంధించి తలెత్తుతున్న సవాళ్లను అధిగమించేందుకు తీర రక్షక దళం చేపట్టిన వివిధ కార్యక్రమాలను గవర్నర్, సిఎంలకు వివరించారు. సరిహద్దు కవ్వింపు చర్యలను సమర్థవంతంగా తిప్పికొట్టాలని గవర్నర్ ఈ సందర్భంగా వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో కోస్ట్‌గార్డ్ ఉన్నతాధికారులు డిఐజి యోగేంధర్ ఢాకా, కమాండెంట్ కె మురళి, డిప్యూటీ కమాండెంట్ ఎబి రామమ్ పాల్గొన్నారు.

ఖాళీగా ఉన్న స్థానిక సంస్థలకు 3న ఎన్నికలు

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న మండల పరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కో ఆప్టెడ్ సభ్యుల ఎన్నికకు రాష్ట్ర ఎన్నికల కమిషనరు నీలంసహాని శుక్రవారం నోటిఫికేషన్ .జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఎంపిపిలు, ఉపాధ్యక్షులు, కోఆప్టెడ్ సభ్యుల ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేయడంతోపాటు ఫిబ్రవరి 3న ఎన్నికలు నిర్వహించాలని ఆమె పేర్కొన్నారు. మండల పరిషత్ ప్రత్యేక సమావేశం ఈ నెల 30లోగా నోటీసు జారీ చేయాల్సిందిగా ఆ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఫిబ్రవరి 3వ తేదీ ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశంలో ఈ ఎన్నిక నిర్వహించనున్నట్లు కమిషన్ పేర్కొంది.

ఎన్నికలు జరుగనున్న మండలాలివే

అనకాపల్లి జిల్లా కోటవురట్ల, ఎన్‌టిఆర్ జిల్లా గంపలగూడెం, నెల్లూరు జిల్లా జలదంకి, తిరుపతి జిల్లా చిల్లకూరు, కర్నూలు జిల్లా మడకశిరలో కో ఆప్టెడ్ సభ్యుల ఎన్నిక చేపట్టనున్నారు. ఎస్.రాయవరం, పిడుగురాళ్ల, సంతమాగులూరు, ఆలూరు, విడపనకల్లు, చెన్నే కొత్తపల్లి మండల అధ్యక్షుల ఎన్నిక ప్రకియ చేపట్టనున్నారు.

ఎపిపిఎస్‌సి పరీక్షల తేదీలివే..

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఎపిపిఎస్‌సి) పలు పోస్టులకు పరీక్షల తేదీలను ప్రకటించింది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను కమిషన్ కార్యదర్శి జె ప్రదీప్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటన ద్వారా వెల్లడించారు. ఆయుష్ శాఖలోని మెడికల్ ఆఫీసర్ (ఆయుర్వేద, హోమియోపతి, యునాని) పోస్టులకు ఏప్రిల్ 2న పరీక్ష నిర్వహించనుంది. ఆయుష్‌లోనే ఆయుర్వేద, హోమియో విభాగం లెక్చరర్స్, అసిస్టెంట్ ప్రొఫెసర్స్ పోస్టులకు ఏప్రిల్ 1, 2, 3 తేదీల్లో పరీక్ష నిర్వహించనుంది. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పేపర్-2 పరీక్షలు జరగనున్నాయి. రెవెన్యూ శాఖలోని జూనియర్ అసిస్టెంట్ కం కంప్యూటర్ అసిస్టెంట్ (గ్రూప్-4 సర్వీస్) పోస్టులకు ఏప్రిల్ 4వ తేదిన పరీక్ష జరగనుంది. ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్ర 5 గంటల వరకు పేపర్-2 పరీక్ష జరుగుతుంది.

విభజన హామీల సాధనలో యువత భాగస్వామ్యం కావాలి

- తిరుపతి, నెల్లూరు,ఒంగోలులో ప్రత్యేక హోదా సమరయాత్ర 2.0

ప్రజాశక్తి - యంత్రాంగం

విభజన హామీల సాధన కోసం జరుగుతున్న ప్రజాస్వామ్యయుత పోరాటంలో యువత భాగస్వాములు కావాలని పలువురు వక్తలు కోరారు. విద్యార్థి, యువజన సంఘాలు, ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి చేపట్టిన 'ప్రత్యేక హోదా సాధన సమరయాత్ర 2.0' శుక్రవారం తిరుపతి, నెల్లూరు,ఒంగోలులో పర్యటించింది. తిరుపతిలోని ఎస్‌వియు క్యాంపస్‌లోని శ్రీనివాస ఆడిటోరియంలో ప్రత్యేక హోదా విభజన హామీల సాధన కమిటీ కన్వీనర్ చలసాని శ్రీనివాస్, ఎఐఎస్‌ఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, ఎస్‌ఎఫ్‌ఐ మాజీ జాతీయ నాయకులు వందవాసి నాగరాజు, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు కె.ప్రసన్న కుమార్, ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.లెనిన్ బాబు, డివైఎఫ్‌ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామన్న, పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి సునీల్, పిడిఎస్‌ఓ కన్వీనర్ ఆర్.ఆశ, ఐఎఫ్టియు నాయకులు పి.వెంకటరత్నం పాల్గొని ప్రసంగించారు. విభజన చట్టంలో పేర్కొన్న వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక నిధులు, గిరిజన, కేంద్రీయ విద్యాసంస్థల అభివృద్ధికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, రామాయపట్నం పోర్టు, పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయించి నిర్మాణం పూర్తి చేయాలని, నూతన పరిశ్రమల ఏర్పాటుకు రాయితీలు ఇవ్వాలని కోరుతున్నా దున్నపోతు మీద వర్షం కురుస్తున్న చందంగా కేంద్ర ప్రభుత్వ వైఖరి ఉందని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా వస్తే విద్యాసంస్థలు, పరిశ్రమలు వస్తాయని, వీటన్నింటి వల్ల రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తగ్గిపోయి భవిష్యత్తు బాగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. యాత్రకు నెల్లూరులో పిడిఎఫ్ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మద్దతు తెలిపి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం దుర్మార్గపు విధానాలు, రాష్ట్రానికి రావాల్సినటువంటి హామీలను ప్రశ్నించేవారు లేకపోవడం దౌర్భాగ్యమన్నారు. ఓ పథకం ప్రకారం రాష్ట్రానికి కేంద్రం నమ్మక ద్రోహం చేసిందన్నారు. రాష్ట్రంలో కులాల కుంపట్లో కొట్టుకొనిపోకుండా అభివృద్ధి వైపు పయనింప చేసేందుకు, ప్రజలను చైతన్యం చేసేందుకు ఈ బస్సు యాత్ర చేస్తున్నారని, ఈ కార్యక్రమానికి తాము బాసటగా నిలుస్తామన్నారు. ఒంగోలులో యాత్రనుద్దేశించి సిపిఎం రాష్ట్ర నాయకులు వి.కృష్ణయ్య మాట్లాడారు.

విభజన హామీలను అమలు చేయకుండా రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం నమ్మక ద్రోహం చేస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఐదు కాదు పది సంవత్సరాలు ఇస్తానని తిరుపతి బహిరంగ సభలో ప్రధాని మోడీ చెప్పారన్నారు. హామీ ఇచ్చి ఎనిమిదిన్నర సంవత్సరాలు దాటినా ఇంతవరకు హామీల ఊసే ఎత్తకపోవడం దారుణమన్నారు. పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి ఎల్.రాజశేఖర్ మాట్లాడుతూ..కడప ఉక్కు ఆంధ్రుల హక్కుగా పోరాడతామని తెలిపారు. ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్ బాబు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఉపాధి, ఉద్యోగ అవకా కల్పించడకుండా ద్రోహం చేస్తున్నాయని విమర్శించారు.



యాత్రకు మద్దతు తెలిపి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం

విశ్వాసం, సమర్థత, నిజాయితీల్లో ఎపి పోలీసులకు తొలి ర్యాంక్

- డిజిపి వెల్లడి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



పోలీసులపై ప్రజల్లో విశ్వాసం, సమర్థత, నిజాయితీకి సంబంధించి అన్ని రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వం, ప్రైవేటు ఏజెన్సీలతో నిర్వహించిన సర్వేలో మొదటి స్థానం మన రాష్ట్రం దక్కించుకుంది. గతేడాది పోలీసు శాఖ తీసుకున్న ప్రత్యేక చర్యల ద్వారా ఈ ఫలితాలు లభించినట్లు డిజిపి రాజేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. అవార్డు వచ్చేందుకు తీసుకున్న ప్రామాణికాల్లో 1.7కోట్లు దిశ మొబైల్ అప్లికేషన్ రిజిస్ట్రేషన్లు, సాంకేతికతతో కూడిన కచ్చితమైన సాక్ష్యాధారాలు, నేర నిరూపణతో శిక్ష పడే విధంగా దర్యాప్తు, పీపుల్ ఫ్రెండ్లీ పోలీస్, సాంకేతిక వినియోగం ద్వారా త్వరితగతిన పోలీసు ప్రతిస్పందన, పోలీసుల్లో క్రమశిక్షణా విధానాన్ని పెంపొందించడం అంశాల్లో మిగిలిన అన్ని రాష్ట్రాల కంటే ముందంజలో ఉన్నామని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించడంలో సహకరించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు డిజిపి పేర్కొన్నారు. పోలీసులపై ప్రజల విశ్వాసం ఉన్న ఐదు రాష్ట్రాలు వరుసగా ఎపి, తమిళనాడు, తెలంగాణ, గుజరాత్, ఢిల్లీ, ఉన్నాయి. సమర్థతలో ఎపి, తెలంగాణ, గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, జార్కండ్, ఉన్నాయి. నిజాయితీలో ఎపి, ఉత్తరాఖండ్, తెలంగాణ, గుజరాత్, ఢిల్లీ నిలిచాయి. న్యూఢిల్లీలో ఈనెల 20నుంచి 22 వరకు మూడు రోజుల పాటు ప్రధాని, కేంద్ర హోంమంత్రి అధ్యక్షతన రాష్ట్రాల డిజిపిలతో జరిగిన సమావేశంలో ఈ సర్వే ఫలితాలను కేంద్రప్రభుత్వం ప్రకటించినట్లు డిజిపి తెలిపారు.

తారకరత్నకు తీవ్ర గుండెపోటు

రాత్రి 12గం. ప్రాంతంలో బెంగళూరు తరలింపు

ప్రజాశక్తి-గుడుపల్లి (చిత్తూరు జిల్లా)



నారా లోకేష్ పాదయాత్రకు వచ్చిన సినీ నటుడు నందమూరి తారకరత్న తీవ్ర గుండెపోటుకు గురయ్యారు టిడిపి శ్రేణులు తోసుకోవడంతో తీవ్ర అస్వస్థతకు గురయి సొమ్మసిల్లి పడిపోయిన ఆయన్ను హుటాహుటిన కుప్పంలోని పిఇఎస్ మెడికల్ ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం ఉదయం 12 గంటల నుండి రాత్రి 12 గంటల వరకు ఆయనకు అక్కడే చికిత్స చేశారు. హైదరాబాద్ నుండి హుటాహుటిన వచ్చిన ఆయన భార్య అలేఖ్య, కుమార్తెల సూచనల మేరకురాత్రి 12 గంటల తరువాత మెరుగైన చికిత్స కోసం బెంగళూరులోని నారాయణ హృదయాలయ ఆస్పత్రికి తరలించారు. అంతకుముందు అనూహ్యంగా చోటుచేసుకున్న ఈ సంఘటనతో టిడిపి శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది. పాదయాత్రలోనే ఉన్న బాలకృష్ణ కుప్పం ఆస్పతిక్రి చేరుకున్నారు. అప్పటికప్పుడే ఆయన్ను బెంగళూరు తరలించడానికి సిద్ధమైనారు. హెలికాప్టర్‌లో తరలించాలా, రోడ్డు మార్గంలో తరలించాలా అన్న విషయమై మల్లగులాలు పడ్డారు. టిడిపి అధినేత చంద్రబాబునాయుడు కర్ణాటక ముఖ్యమంత్రితో కూడా మాట్లాడినట్లు వార్తలు వచ్చాయి. బెంగళూరు నుండి ఆధునిక వసతులతో ఉన్న రెండు అంబులెన్స్‌లు కుప్పంకు చేరుకున్నాయి. అయితే, వైద్యుల సూచనతో కుప్పంలో ఉంచాలని నిర్ణయించుకున్నారు. అయితే హైదరాబాద్ నుండి వచ్చిన తారకరత్న భార్య, కుమార్తె సూచనతో బెంగళూరు తరలించడానికి నిర్ణయం తీసుకున్నారు.

90 శాతం బ్లాక్ అయ్యాయి : బాలకృష్ణ

తారకరత్నకు గుండె కుడి, ఎడమ వాల్వ్‌లు 90 శాతం బ్లాక్ అయినట్లు, తీవ్ర ఉధృతిలో గుండెపోటు (మాసివ్ హార్ట్‌స్ట్రోక్) వచ్చినట్లు బాలకృష్ణ తెలిపారు. చికిత్స పొందుతున్న తారకరత్నను తొలిరోజు యాత్ర ముగింపు అనంతరం లోకేష్ పరామర్శించారు. తారకరత్న ఆరోగ్య పరిస్థితిపై ఆస్పత్రి వైద్యులను చంద్రబాబు ఫోన్లో అడిగి తెలుసుకున్నారు.

అబద్ధాల్లో తండ్రిని మించిన లోకేష్ : నాని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అబద్ధాలు వల్లెవేయడంలో నారా లోకేష్ తన తండ్రి చంద్రబాబు నాయుడు కంటే పది ఆకులు ఎక్కువ చదివారని మాజీమంత్రి, వైసిపి ఎమ్మెల్యే పేర్ని వెంకటరామయ్య (నాని) ఆరోపించారు. రాజకీయాలు నేర్చుకోవాల్సిన వయసులో బరితెగించి అబద్ధాలు మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. వైసిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 40వేల ఐటి ఉద్యోగాలు ఇచ్చామని, 25వేల కిలోమీటర్ల రోడ్లు వేశారని, కడపలో స్టీల్‌ప్లాంటు, బందరు పోర్టు కట్టారని, ఐదేళ్లలో 5 లక్షల ఉద్యోగాలు ఇచ్చారని, అమరావతి రాజధాని నిర్మాణం పూర్తిచేశామని పచ్చి అసత్యాలను, అభూత కల్పనలను చెప్పుకొచ్చారని విమర్శించారు. నందమూరి వారసులు పార్టీ పగ్గాలు చేపడతారేమోనన్న భయంతో యాత్ర పేరుతో ప్రాయోజిత కార్యక్రమం చేపట్టారని ఆరోపించారు.

చోరీ కేసులో అనుమానితుడు ఆత్మహత్య

- పోలీసుల తీరే కారణమని బంధువుల ఆరోపణ

ప్రజాశక్తి-అర్ధవీడు (ప్రకాశం జిల్లా)

చోరీ కేసులో అనుమానితుడిగా ఉన్న వ్యక్తి ఆత్మహత్యకు యత్నించగా.. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు కొట్టడం వల్లే మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి బంధువులు ఆరోపించారు. ఈ సంఘటన ప్రకాశం జిల్లా అర్ధవీడు మండలంలో చోటుచేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 22న అర్ధవీడు మండలం కాకర్ల గ్రామంలోని ఓ ఇంటిలో బంగారం, నగదు చోరీ జరిగింది. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకటేశ్వరనాయక్ కేసు నమోదు చేశారు. అనంతరం అనుమానితుడిగా ఉన్న అదే గ్రామానికి చెందిన మండ్ల లక్ష్మయ్యను గురువారం స్టేషన్‌కు పిలిపించి.. తమదైన శైలిలో విచారించారు.

శుక్రవారం మళ్లీ విచారణకు రావాలని ఆదేశించారు. తీవ్ర మనస్తాపం చెందిన లక్ష్మయ్య కేశాలకు పట్టించే (వాస్మోల్ అయిల్) ఆయిల్‌ను తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి మార్కాపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు జిజిహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మొదటి రోజు విచారణ పేరుతో పోలీసులు తనను తీవ్రంగా కొట్టారని.. మళ్లీ విచారణకు రావాలని చెప్పడంతో ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పిన వీడియో గురువారం వైరల్ అయ్యింది. దీనిపై ఎస్ఐ వెంకటేశ్వర్‌నాయక్‌ను మీడియా వివరణ కోరగా అనుమానితులను విచారించిన మాట వాస్తవమేనని, వారిని కొట్టడం అవాస్తవమని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

- సిఎంకు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అంగన్‌వాడీలకు కనీస వేతనాలు ఇవ్వాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యూటీ ఇవ్వాలని, ఫేస్ యాప్ రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) కోరింది. ఈ మేరకు శుక్రవారం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, ఐసిడిఎస్ మంత్రి ఉషశ్రీచరణ్‌కు యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి.బేబిరాణి, కె.సుబ్బరావమ్మ మెయిల్ ద్వారా వినతిపత్రం పంపించారు. అంగన్‌వాడీలకు కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఫేస్‌యాప్ రద్దుచేయాలని, పర్యవేక్షణ పేరుతో వేధింపులు ఆపాలని కోరారు. వైఎస్‌ఆర్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలని, గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని అన్నారు. 2017 నుండి పెండింగ్‌లో ఉన్న డిఎ బిల్లులు చెల్లించాలని కోరారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు వేతనంతో సగం పెన్షన్ ఇవ్వాలన్నారు.

సీనియారిటీ ప్రకారం వేతనాలు ఇవ్వాలని, గ్రేడ్ 2 సూపర్ వైజర్ పోస్టులకు వయోపరిమితి తొలగించాలని విజ్ఞప్తి చేశారు. హెల్పర్ల వయో పరిమితి 50 సంవత్సరాలకు పెంచాలని, ప్రమోషన్లలో రాజకీయ జోక్యం అరికట్టాలని అన్నారు. 300 జనాభా దాటిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, వర్కర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలని, మినీ సెంటర్లలో వర్కర్లను మెయిన్ వర్కర్లుగా తీసుకుని అదనంగా హెల్పర్లను నియమించాలని కోరారు. లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారాన్ని సరఫరా చేయాలని, ఆయిల్, కందిపప్పు క్వాలిటీ పెంచాలని విజ్ఞప్తి చేశారు. అంగన్‌వాడీలకు జాబ్ క్యాలండర్ నిర్ణయించాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవు సదుపాయం కల్పించాలని కోరారు. సర్వీసులో ఉండి చనిపోయిన ఒకరికి ఉద్యోగం, బీమా అమలు చేయాలని, జిఓ నెంబరు1ని రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.

సచివాలయ ఉద్యోగి ఆత్మహత్య

ప్రజాశక్తి - నరసరావుపేట (పల్నాడు)

గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న నాగేంద్రబాబు (27) ఆత్మహత్య చేసుకున్న ఘటన పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మాచవరం మండలం గంగిరెడ్డిపాలేనికి చెందిన నాగేంద్రబాబు మేనమామ సహకారంతో చదువుకుని కొంతకాలం కిందట సచివాలయంలో ఉద్యోగానికి ఎంపికయ్యారు. నరసరావుపేట మండలం రావిపాడులోని సచివాలయం-1లో డిజిటల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. నరసరావుపేటలోని పెద్ద చెరువు మూడవ లైనులో ఓ గదిని అద్దెకు తీసుకుని, అక్కడి నుండే విధులకు వెళ్లేవారు. శుక్రవారం ఉదయం గది నుంచి నాగేంద్రబాబు బయటికి రాకపోవడంతో తోటి ఉద్యోగులు గదిలోపలికి వెళ్లి చూడగా నాగేంద్రబాబు ఫ్యాన్‌కు ఉరేసుకుని ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానియ ఏరియా ఆస్పత్రికి పోలీసులు తరలించారు. తన వద్ద ఉన్న డబ్బుతోపాటు ఇతరుల వద్ద అప్పుగా తీసుకుని స్నేహితులకు ఇచ్చారని, దాన్ని వారు తిరిగివ్వకపోవడం, మరోవైపు వాటిని చెల్లించాలనే ఒత్తిడి పెరగడంతో నాగేంద్ర ఆత్మహత్య చేసుకుని ఉంటారని స్నేహితులు చెబుతున్నారు. లివర్ సంబంధిత ఆరోగ్య సమస్యలూ ఉన్నాయని సమాచారం.

యువత కోసం ప్రత్యేక మ్యానిఫెస్టో

మొదటి పేజీ తరువాయి

వెనక్కి తెస్తానన్నారు. జగన్ ప్రభుత్వంలో సామాజిక న్యాయం మృగ్యమైందని విమర్శించారు. మూడున్నరేళ్ల కాలంలో టిడిపి కార్యకర్తలపైనా, నాయకులపైనా దాడులు చేయడమే కాకుండా అక్రమ కేసులు బనాయించిందని విమర్శించారు. హత్యా రాజకీయాలు చేసిందని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే అంతకంత చక్రవడ్డీతో చెల్లిస్తామన్నారు. ప్రజాస్వామ్యంలో ఆందోళన చేసే హక్కు ఎవరికైనా ఉందని తెలిపారు. ఎవరినీ ఆందోళన చేయనీయకుండా, పవన్ కల్యాణ్‌ను సైతం బయటకు రానీయకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. జిఓ-1ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు అధికారంలో లేనప్పుడు కార్యకర్తలు... కార్యకర్తలు అంటారని, అధికారంలోకి వచ్చాక అధికారులు... అధికారులు అంటారని అన్నారు. లోకేష్ అలాంటి వాడు కాదని, అడ్డొచ్చిన వారి తాటతీసి కార్యకర్తలకు న్యాయం చేస్తారని పేర్కొన్నారు. పాదయాత్రలో లోకేష్‌కు వెన్నంటి ఉండి అడుగులో అడుగువేసి విజయవంతం చేస్తామన్నారు. బహిరంగసభకు టిడిపి రాష్ట్ర నాయకులు వర్ల రామయ్య అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, తెలుగు మహిళా రాష్ట్ర అధ్యక్షులు వంగలపూడి అనితతో పాటు దాదాపు 300 మంది వేదికపై ఆశీనులయ్యారు.


లోకేష్ హామీలు

బహిరంగ సభలో లోకేష్ పలు హామీలు గుప్పించారు. వాటిలో కొన్ని...

- టిడిపి అధికారంలోకొస్తే యువతకు మ్యానిఫెస్టో
- ఏటా డిఎస్‌సి
- ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలన్నీ భర్తీ
- భవన నిర్మాణ కార్మికులకు పనిలేకుండా చేసిన జగన్ ఇసుక పాలసీని రద్దు చేసి, పాత విధానాన్ని తెచ్చి ఉచితంగా ఇసుక
- రాయలసీమ ప్రజలకు ఉచితంగా డ్రిప్ ఇరిగేషన్
- రైతులకు సబ్సిడీతో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు
- పంటకు గిట్టుబాటు ధర
- కౌలు రైతులకు ప్రత్యేక కార్యాచరణ
- రాయలసీమకు గోదావరి, కృష్ణా నీటిని తీసుకొచ్చి పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి
- ఉత్తరాంధ్రకు ప్రత్యేక కార్యాచరణ
- ఎస్‌సి, ఎస్‌టిల సబ్‌ప్లాన్ నిధులు వారికే ఖర్చు
- బిసిలకు ఆదరణ పథకం పునరుద్ధరణ
- మహిళలకు ఆర్థిక స్వావలంబనతోపాటు ప్రత్యేక భద్రత

జమున మృతికి ప్రముఖుల సంతాపం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



సినీనటి జమున మృతి కళారంగానికి తీరనిలోటని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ పేర్కొన్నారు. ఆమె కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. అద్భుతమైన కళాకారిణిని కోల్పోయామని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. జమున మృతి తీరనిలోటని మాజీ సిఎం చంద్రబాబునాయుడు తెలిపారు. జమునను కోల్పోవడం బాధాకరమని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వివరించారు. మాభూమి నాటకం ద్వారా పరిచయమైన జమున మరణం తీరనిలోటని ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్ తెలిపారు.

సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్ర సంతాపం

జమున మృతిపట్ల సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్ర సంతాపం ప్రకటించింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ప్రజానాట్యమండలి వ్యవస్థాపకులు గరికపాటి రాజారావు ద్వారా సినీ ప్రస్థానం మొదలైన జమున సినీ, నాటక రంగాల్లోనూ, పార్లమెంటు సభ్యులుగా విశేష కృషి చేశారని పేర్కొన్నారు. ఆమె మరణం తీరనిలోటని పేర్కొన్నారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

సాహితీ స్రవంతి సంతాపం

జమున మృతిపట్ల సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి, అధ్యక్షులు కెంగార మోహన్ సంతాపం ప్రకటించారు. ప్రజానాట్యమండలి పునరుద్ధరణ సమయంలోనూ జమున సహకరించారని వివరించారు.

జమున మరణం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు తదితరులు విచారం వ్యక్తం చేశారు. వెండితెర సత్యభామగా పేరుగాంచిన ఆమె పోషించిన పాత్రలు ఆత్మవిశ్వాసానికి, మహిళా సాధికారతకు ప్రతీకలుగా ఉండేవని పేర్కొన్నారు.


దీక్షల్లో కూర్చున్న ఉక్కు కార్మికులు

'ఉక్కు' పోరాటానికి విశాల మద్దతు

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రయివేటీకరణ బారి నుంచి కాపాడుకోవడానికి రెండేళ్లుగా జరుగుతున్న పోరాటానికి దేశ వ్యాప్తంగా విశాలమైన మద్దతు లభిస్తోందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 715వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ ట్రాఫిక్ డిపార్టుమెంట్ విభాగం ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి నాయకులు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం దిగొచ్చి స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను నిలుపుదల చేస్తున్నామని ప్రకటించే వరకూ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. దీక్షల్లో పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, నాయకులు జె.రామకృష్ణ, వరసాల శ్రీనివాసరావు, గుమ్మడి నరేంద్ర టి.భాస్కరరావు, ఆవల అప్పారావు, జె.రామన్న, ఎస్.పాపారావు, ఎస్.గోవింద్, డి.వి.రమణ పాల్గొన్నారు.

పనిప్రదేశంలో లైంగిక వేధింపుల నిరోధానికి అంతర్గత కమిటీ

- దేవాదాయశాఖ కమిషనరు హరిజవహర్‌లాల్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పనిప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధానికి అంతర్గత కమిటీ ఏర్పాటు చేసినట్లు దేవాదాయశాఖ కమిషనర్ హరి జవహర్‌లాల్ పేర్కొన్నారు. కమిషనర్, ఎండోమెంట్స్ డిపార్టుమెంట్ కార్యాలయంలో పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల (నివారణ, నిషేధం, పరిష్కారాలు) చట్టం, 2013లోని రూల్ 4(1) ప్రకారం (3) మహిళా ఉద్యోగులతో కూడిన అంతర్గత సమ్మతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విజయవాడలోని దేవాదాయశాఖ ప్రధాన కార్యాలయంలో మహిళా ఉద్యోగులకు సురక్షితమైన పని వాతావరణాన్ని కల్పించేందుకు పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల (నివారణ, నిషేధం, పరిహారం) చట్టం, 2013లోని రూల్ 4(1) ప్రకారం సభ్యులతో తాత్కాలిక కమిటీని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రధాన కార్యాలయంలో గెజిటెడ్ సూపరింటెండెంట్ కె.శోభారాణి, గెజిటెడ్ సూపరింటెండెంట్ ఎస్. వెంకటలక్ష్మి, అసిస్టెంట్ కమిషనర్ జిల్లా ఎండోమెంట్స్ అధికారి టి.అన్నపూర్ణలతో కమిటీ ఏర్పాటు చేసినట్లు కమిషనరు హరిజవహర్‌లాల్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని క్యాడర్‌లోని దేవాదాయశాఖలోని మహిళా ఉద్యోగులందరూ తమ ఫిర్యాదులు ఏవైనా ఉంటే నేరుగా కమిటీకి తెలియజేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల దేవాదాయశాఖ అధికారులు, ఎగ్జిక్యూటివ్ అధికారులు ఉత్తర్వులను ఉద్యోగులందరికీ ముఖ్యంగా మహిళా ఉద్యోగులకు తెలపాలని దేవాదాయశాఖ కమిషనరు తెలిపారు.

గ్రూపు-1 ప్రిలిమ్స్ పరీక్షా ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రూపు-1 పరీక్షా ఫలితాలను ఎపిపిఎస్‌సి శుక్రవారం విడుదల చేసింది. మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థులు వివరాలు వెబ్‌సైట్‌లో పొందుపరచినట్లు ఎపిపిఎస్‌సి పేర్కొంది. గ్రూపు-1 మెయిన్స్‌కోసం పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేసింది. మెయిన్స్ పరీక్షలు ఏప్రిల్ 23నుంచి 29వరకు నిర్వహించనున్నట్లు ఎపిపిఎస్‌సి తెలిపింది.

మార్చి 1 నుండి ఆస్పత్రుల సందర్శన


మొదటి పేజీ తరువాయి

పథకం, ఆస్పత్రి నిర్మాణాలను మార్చినాటికి పూర్తిచేయాలన్నారు. రాష్ట్రంలో క్యాన్సర్ వ్యాధిని ముందుగానే గుర్తించి బాధితులకు తగిన వైద్యం అందించడానికి వైద్య స్బిబందికి స్క్రీనింగ్, చికిత్సలపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి బోధనాస్పత్రిలో, మెడికల్ కళాశాలల్లో క్యాన్సర్ నివారణా పరికరాలు, గుండె జబ్బుల చికిత్సలు అందుబాటులో ఉంచాలన్నారు. అన్నిచోట్ల క్యాథల్యాబ్స్ పెట్టాలని తెలిపారు.. నూతనంగా రూపొందించిన ఆరోగ్యశ్రీ యాప్‌ను పరిశీలించిన సిఎం పలు మార్పులు చేర్పులు చేయాలని సూచించారు. త్వరలో యాప్ ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు.

త్రిపురలో ఎర్ర జెండాల హోరు

మొదటి పేజీ తరువాయి

లెఫ్ట్ ఫ్రంట్ అభ్యర్థులను నిలపడం లేదు. నామినేషన్లను దాఖలు చేయడానికి ఈ నెల 30 వరకూ మాత్రమే గడువు ఉంది. దీంతో నామినేషన్ల ప్రక్రియ వేగంగా సాగుతోంది. సుర్మా విధానసభ నియోజకవర్గం నుంచి లెఫ్ట్ ఫ్రంట్ అభ్యర్థిగా అంజన్ దాస్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా వేలాది మందితో ర్యాలీ నిర్వహించారు. అలాగే కార్‌బూక్ (ఎస్‌టి) నియోజకవర్గంలో ప్రియమణి దెబ్బార్మ నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రదర్శనలో వందలాది మంది పాల్గొన్నారు. అంబసా నియోజకవర్గంలో లెఫ్ట్‌ఫ్రంట్ అభ్యర్థి అమ్లెందు దెబ్బర్మ నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా నగర వీధుల్లో ఎర్రజెండాలతో భారీ ప్రదర్శన జరిగింది. అలాగే కృష్ణాపూర్ నియోజకవర్గ అభ్యర్థి శస్తి దేవ్‌వర్మ, ప్రమోద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థి మనీంద్ర చంద్ర దాస్ కూడా శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. చాందిపూర్ లెఫ్ట్ ఫ్రంట్ అభ్యర్థి కృష్ణేందు చౌదరీ శుక్రవారం భారీ సంఖ్యలో కార్యకర్తలు మద్దతుదారులుతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. పాణీసాగర్ నియోజవర్గంలో సిపిఎం అభ్యర్థి షీతల్ దాస్ వేలాది మంది ప్రజలతో కలసి నామినేషన్ దాఖలు చేయడానికి వెళ్లారు. రైమవలి నియోజకవర్గంలో సిపిఎం పాబిన్ త్రిపుర నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో వేలాది మంది పాల్గొన్నారు. మాను అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ప్రభాత్ చౌదరీ నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. బారాజల, ప్రతాప్‌ఘడ్ నియోజకవర్గ సిపిఎం అభ్యర్థులు అగర్తలలో నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా అగర్తల జాతీయ రహదారిపై నిర్వహించిన ర్యాలీలో కార్యకర్తలు, మద్దతుదారులు వేలాదిగా పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలోని లోపాలను మీడియాకు చూపుతున్న అజశర్మ

ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలోని లోపాలను సరిచేయండి

- ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఓటర్ల తుది జాబితాలో ఉన్న లోపాలను సరిచేయాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ అజ శర్మ కోరారు. ఈ మేరకు ఆయన ఎపి చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌కు లేఖ రాశారు. ఆ వివరాలను విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. డిసెంబర్ 30న విడుదల చేసిన ఎమ్మెల్సీ ఓటర్ల తుది జాబితాలో అభ్యంతరకరమైన అవకతవకలు చోటుచేసుకున్నాయన్నారు. అనేక మంది పేర్లు అర్హత లేకపోయినా జాబితాలో పొందుపరచబడ్డాయన్నారు. అర్హత లేని ఐదు, ఏడు, పదో తరగతి. ఇంటర్, డిప్లొమో చదివిన వారు, ఆఖరుకు నిరక్షరాస్యుల పేర్లు సైతం జాబితాలో నమోదయ్యాయని తెలిపారు. విశాఖపట్నం జిల్లాలో ఇలా తన దృష్టికి 1752 పేర్లు వచ్చాయని వెల్లడిచారు. బూత్ నెంబర్ 216 లోని శరత్ కుమార్ నారాయణశెట్టి పేరును వరుసగా ఐదు సార్లు ఓటర్ లిస్టులో చేర్చారన్నారు. ఇలా విశాఖపట్నం జిల్లాకు సంబంధించి 4069 పేర్లు తమ దృష్టికి వచ్చాయన్నారు. ఒక మండలానికి సంబంధించిన పేర్లు మరొక మండలానికి చెందిన జాబితాలో ఉన్నాయని తెలిపారు. భౌతికంగానూ, ఆన్‌లైన్ ద్వారానూ ఫారం 18 ద్వారా అప్లికేషన్ ఇచ్చిన అనేకమంది పేర్లు ఓటర్ల జాబితాలో నమోదు కాలేదన్నారు. ఓటర్ల జాబితాలోని లోపాలను గత ఏడాది డిసెంబర్ 3న తాము అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ వాటిని సరిచేయకుండా తుది జాబితా విడుదల చేశారని తెలిపారు. ఈ నేపథ్యంలో సమగ్ర విచారణ జరిపి లోపాలను సరిచేయాలని కోరారు. డిసెంబర్ తొమ్మిది గడువులోగా అప్లికేషన్ ఇచ్చిన అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

మా బంగారం ఉందో? లేదో? చెప్పండి

- యూనియన్ బ్యాంకును ముట్టడించిన రైతులు, ఖాతాదారులు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ (పల్నాడు జిల్లా)



బ్యాంకును చుట్టుముట్టిన ఖాతాదారులు, రైతులు

బ్యాంకులో తాము తనఖా పెట్టిన బంగారం ఉందో? లేదో? చెప్పాలని డిమాండ్ చేస్తూ పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రెంటపాళ్లలోని యూనియన్ బ్యాంకు బ్రాంచ్ వద్ద రైతులు, ఖాతాదారులు శుక్రవారం ఆందోళనకు దిగారు. బ్యాంకును చుట్టుముట్టారు. తమ బంగారంపై వివరాలు చెప్పాలని అధికారులను నిలదీశారు. బంగారంపై రుణాలు తీసుకుని తిరిగి చెల్లించినా బ్యాంకర్లు తనఖా బంగారం తిరిగి ఇవ్వడంలేదని, అప్రైజర్‌తో కలిసి మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ బంగారం మాయం చేశారని తెలుసుకున్న చుట్టుపక్కల గ్రామాల నుండి రైతులు, ఖాతాదారులు బ్యాంకు వద్దకు చేరుకున్నారు. బ్యాంకులోకి వెళ్లేందుకు ప్రయత్నించగా అప్పటికే బ్యాంకు వద్ద ఉన్న పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గద్దె చలమయ్య అక్కడికి చేరుకుని రైతుల ఆందోళనకు మద్దతు తెలపడంతోపాటు బ్యాంకు అధికారులతో చర్చించారు. బంగారం మాయమైన ఖాతాదారుల పేర్లు ప్రకటించాలని, అది ఏమైందో నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. దీనిపై ఖాతాదారులతో యూనియన్ బ్యాంక్ గుంటూరు రీజినల్ చీఫ్ మేనేజర్ వీరభద్రరావు మాట్లాడారు. ఖాతాదారులు ఆందోళన చెందొద్దని, ప్రతిపైసాకూ బ్యాంకు బాధ్యత వహిస్తుందని హామీ ఇచ్చారు. బంగారం మాయమైన ఖాతాల వివరాలను సోమవారం వెల్లడిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా చలమయ్య మాట్లాడుతూ బంగారాన్ని మాయం చేసిన బ్యాంకు సిబ్బందిని తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, బ్యాంకులో ఎంత బంగారం మాయమైందో లెక్క తేల్చాలని, మిగిలిన బంగారం నాణ్యతను పరీక్షించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత బ్యాంకు మేనేజర్ సిహెచ్.నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు సస్పెండైన బ్యాంకు మేనేజర్ డి.రాంబాబు నాయక్, అసిస్టెంట్ మేనేజర్ ఎం.రవికుమార్, అప్రైజర్ సంపత్ కుమార్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. 49 మందికి సంబంధించి 3,199.42 గ్రాములు బంగారం మాయమైనట్లు గుర్తించారు.



కార్మికులతో కలిసి దీక్షలో పాల్గొన్న ఎవి.నాగేశ్వరరావు

నిరంకుశ విధానాలు వీడండి

- కార్మికుల సమస్యలను పరిష్కరించాలి
- ఆంధ్ర పేపరు మిల్లు కార్మికుల పోరాటానికి సిఐటియు మద్దతు

: ఎవి.నాగేశ్వరరావు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

పేపరు మిల్లు యాజమాన్యం నిరంకుశ విధానాలను పక్కనబెట్టి సామరస్యపూర్వకంగా కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఇద్దరు ముగ్గురు అక్రమార్కులు చేతిలో ఉన్నారని కార్మికుల హక్కులను కాలరాస్తే చూస్తూ ఊరుకోబోమని, వారిని తరిమికొట్టడంతోపాటు యాజమాన్యానికి బుద్ధి చెప్పేందుకు కార్మికులు ఐక్యంగా ఉన్నారని హెచ్చరించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఆంధ్ర పేపరు మిల్లు గేటు ఎదుట కార్మిక సంఘాలు చేపట్టిన నిరసన దీక్షలు శుక్రవారం నాటికి 17వ రోజుకు చేరాయి. దీక్షా శిబిరాన్ని ఎవి.నాగేశ్వరరావు సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేపరు మిల్లు కార్మికులకు సుదీర్ఘ పోరాట చరిత్ర ఉందని గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో పోరాటం కొనసాగించాలని కోరారు. గత ఒప్పందం ప్రకారం హక్కులు కల్పించడంతోపాటు సమస్యలను పరిష్కారించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందని గుర్తు చేశారు. పారిశ్రామిక చట్టాలకు తూట్లు పొడిచి నిరంకుశంగా వ్యవహరించడం సరికాదన్నారు. నిరంకుశ విధానాలను ప్రశ్నించిన కార్మికులపై కక్ష సాధింపు చర్యలు విడనాడాలని డిమాండ్ చేశారు. ఉత్పత్తిని నిలిపివేయకుండా కార్మికులు ఇప్పటి వరకూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్నారని, యాజమాన్యం పరిష్కారమార్గం చూపకుంటే నిలుపుదలకు సిద్ధమవుతారని హెచ్చరించారు. రాజమండ్రి ఎంపి భరత్ యాజమాన్యం పక్షాన నిలబడతారో? కార్మికుల పక్షాన నిలబడతారో? తేల్చుకోవాలన్నారు. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. దీక్షలకు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బేబీరాణి పాల్గొని మద్దతు తెలిపారు. దీక్షల్లో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.అరుణ్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాజులోవ, అధ్యక్షులు సుందరబాబు తదితరులు పాల్గొన్నారు.

నచ్చకపోతే బిగ్‌బాస్ చూడకండి

- హైకోర్టు వ్యాఖ్య


ప్రజాశక్తి-అమరావతి

ఎవరు ఏం మాట్లాడాలో కోర్టులు నిర్ణయించలేవని, బిగ్‌బాస్ కంటే పలు అభ్యంతరకర కార్యక్రమాలు జరుగుతున్నాయని హైకోర్టు అభిప్రాయపడింది. బిగ్‌బాస్ నచ్చకపోతే చూడవద్దని సూచించింది. టివిల్లోని ఫలానా షో అభ్యంతరకరంగా ఉందనుకుంటే దాన్ని చూడొద్దని చెప్పింది. టివిల్లోని ప్రసారాలపై అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదు చేసే వేదికల వద్దకు వెళ్లకుండా హైకోర్టుకు రావడం ఏమిటని పిటిషనర్‌ను ప్రశ్నించింది. ఈ మేరకు స్టార్ టివి యాజమాన్య వాదనలపై రిప్లై కౌంటర్ దాఖలు చేయాలని పిటిషనర్‌ను ఆదేశించింది. విచారణను ఆరు వారాలకు వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ పికె మిశ్రా, జస్టిస్ ప్రతాప వెంకట జ్యోతిర్మయిల డివిజన్ బెంచ్ ఆదేశించింది. యువతను పెడదోవ పట్టించేలా బిగ్‌బాస్ షో ఉందని, దీనిని బ్యాన్ చేయాలని సోషల్ వర్కర్, సినీ నిర్మాత కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి వేసిన పిల్‌ను హైకోర్టు శుక్రవారం విచారించింది. అశ్లీలత, అసభ్యత, అనైతిక, హింసాత్మకంగా బిగ్‌బాస్ షో ఉందని పిటిషనర్ అడ్వకేట్ గుండాల శివప్రసాద్‌రెడ్డి వాదించారు. పోటీలో పాల్గొనే మహిళలకు గర్భధారణ పరీక్షలు చేయడం దారుణమన్నారు. స్టార్ టివి అడ్వకేట్ శ్రీనివాస్ ప్రతివాదన చేస్తూ టివిలో ప్రసారాలపై అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదు చేసే వేదికలు వేరే ఉన్నాయని, అక్కడికి వెళ్లకుండా హైకోర్టులో రిట్ దాఖలు చేయడం చెల్లదని అన్నారు.

పెళ్లింట విషాదం... వివాహానికి వెళుతుండగా రోడ్డు ప్రమాదం

- ఇద్దరు చిన్నారుల మృతి
- పెళ్లికొడుకు సహా ఎనిమిది మందికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - మాచర్ల (పల్నాడు జిల్లా)



సంఘటన చోటు చేసుకున్న ప్రదేశం

పల్నాడు జిల్లా మాచర్ల మండలం వెల్దుర్తి గ్రామ సమీపంలో శుక్రవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో దుర్గి మండలం ముటుకూరు గ్రామానికి చెందిన పెళ్లి బృందంలో ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పల్నాడు జిల్లా దుర్గి మండలం ముటుకూరు గ్రామంలోని జిల్లెల్లమూడి వీరబాబుకు, గుంటూరు జిల్లా తెనాలి పట్టణానికి చెందిన స్వప్నతో శుక్రవారం ఉదయం వెల్దుర్తి మండలంలోని సిరిగిరిపాడు గ్రామంలోని ఆంజనేయ స్వామి దేవాలయంలో వివాహనికి ముహూర్తం నిశ్చయించుకున్నారు. ఈ నేపథ్యంలో మూడు వాహనాలలో ముటుకూరు నుంచి వివాహానికి బయలుదేరారు. పెళ్లి కుమారుడుతో వెళుతున్న వాహనం వెల్దుర్తి వద్ద ఆగిఉన్న టిప్పరును ఢీకొంది. ప్రమాదంలో పెళ్లి కుమారుడి బంధువుల పిల్లలు గోనుగుంట్ల హరీష్ (10) లింగ జస్విక (3) మృతి చెందారు. పెళ్లి కుమారుడుతో పాటు మరో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్కార్పియోను ఎదురుగా ఢీకొనడంతో స్కార్పియో తీవ్రంగా దెబ్బతిని అందులోని వీరంతా దానిలో ఇరుక్కుపోయారు. స్థానికులు కష్టం మీద గడ్డపారలతో డోర్లు తెరిచి వీరందరిని బయటకు లాగి మాచర్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం వారిని మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. కొద్దిసేపట్లో వివాహం జరుగబోతున్న ఆనందంలో ఉన్న వారు ఈ ప్రమాదం జరగడంతో తీవ్ర విషాదంలోకి వెళ్లిపోయారు. వెల్దుర్తి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అత్త, భార్యను చంపిన కిరాతకుడు

ప్రజాశక్తి -పెద్దకడబూరు, మంత్రాలయం

అత్త కట్టుకున్న భార్యపై అతికిరాతకంగా దాడి చేసి హతమార్చిన ఘటన కర్నూలు జిల్లా పెద్దకడబూరు మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. జాలవాడి గ్రామానికి చెందిన నాగరాజుకు ఆదోనికి చెందిన శాంతమ్మతో వివాహం జరిగింది. వీరికి కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. మద్యానికి బానిస అయిన నాగరాజు ప్రతిరోజు భార్యతో గొడవపడేవాడు. అనారోగ్యానికి గురైన మనవడిని చూసేందుకు శాంతమ్మ అమ్మ భీమక్క జాలవాడికు వచ్చారు. ఈ క్రమంలో మద్యం మత్తులో అర్ధరాత్రి భార్యతో నాగరాజు గొడవపడ్డాడు. సర్దిచెప్పేందుకు ప్రయత్నించిన అత్తను, భార్యను వేడకొడవలితో దాడి చేశాడు. తీవ్రగాయాలపాలైన శాంతమ్మ (25), భీమక్క(45) అక్కడికక్కడే మరణించారు. నిందితుడు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బొందిలి కార్పొరేషన్ డైరెక్టర్ తొలగింపు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన వైసిపి మహిళా నాయకులు రసపుత్ర రజనిని ఎపి బొందిలి కార్పొరేషన్ డైరెక్టర్ పదవి నుంచి ప్రభుత్వం తొలగించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల దొంగనోట్ల చలామణి కేసులో కర్ణాటకలో ఆమెను పోలీసులు అరెస్టు చేశారు. రజని వ్యవహారం సోషల్ మీడియా వేదికగా హల్‌చల్ చేసిన సంగతి తెలిసిందే. ప్రతిపక్షాల నుంచి పెద్దఎత్తున విమర్శలు రావడంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది.



కర్నూలు జిల్లా పెద్దకడుబూరు మండలం హెచ్.మురవణి సచివాలయం ముందు ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న వి.వెంకటేశ్వర్లు

తక్షణమే వలసలు ఆపాలి

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- మంత్రాలయం

కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతం వలసలు ఆపాలని, అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించాలని, పెండింగు వేతనాలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లా పెద్ద కడుబూరు మండలం హెచ్ మురవణి గ్రామంలో శుక్రవారం ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఉపాధి హామీ సమస్యలు పరిష్కరించాలంటూ కూలీలతో పని ప్రదేశం నుంచి మురవణి సచివాలయానికి ప్రదర్శనగా వెళ్లి ధర్నా చేశారు. ఈ ధర్నాలో కూలీలు మాట్లాడుతూ 'చేసిన పనికి రెండు నెలల నుంచి వేతనాలు ఇవ్వలేదు.. ఊర్లో పనులు లేక ఉపాధి పనులకు వెళ్తే కూలి చెల్లించలేదు... వలసలు వెళ్తుంటే అధికారులు అడ్డుకుంటున్నారు.. ఏమితినాలి ఎలా బతకాలి' అని ఆందోళన వ్యక్తం చేశారు. వి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం కూలీలకు ఇవ్వాల్సిన డబ్బులు విడుదల చేయకుండా ఆలస్యం చేస్తోందన్నారు. దీంతో కూలీలే ఈ పనులు మాకొద్దు అనేలా చేసి ఉపాధి చట్టాన్ని ఎత్తివేయాలని చూస్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వమూ కూలీలను పట్టించుకోవడంలేదన్నారు. పాలకులు వలసలను అరికట్టడంలో విఫలమవుతున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం బకాయిలు చెల్లించకుంటే రాష్ట్ర ప్రభుత్వం అయినా నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎనిమిది డిమాండ్లతో సచివాలయ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. సచివాలయ కార్యదర్శి కె షాహిద్ మాట్లాడుతూ ఉపాధి కూలీల బకాయిలు చెల్లిస్తామని, అందరికీ పనులు కల్పిస్తామనిహామీ ఇచ్చారు. ఈ ధర్నాలో సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు ఇ తిక్కన్న, మండల కార్యదర్శి వీరన్న, ఎఐఎడబ్ల్యుయు నాయకులు బడేసాహెబ్, వీరేష్, చిన్నరాముడు, నాగరాజు, సిఐటియు మండల కమిటీ నాయకులు పాల్గొన్నారు.

విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో వందే భారత్ రైలు

- కేంద్ర రైల్వే మంత్రికి ఎంపి లావు లేఖ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో వందే భారత్ రైలును ప్రారంభించాలని ఎంపి లావు శ్రీకృష్ణ దేవరాయలు కోరారు. ఇది పారిశ్రామిక వృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ఆయన లేఖ రాశారు. తిరుపతి వెళ్లే భక్తులకు వీలుగా సికింద్రాబాద్ - తిరుపతి మధ్య వయా పిడుగురాళ్ల, గుంటూరు మీదుగా వందేభారత్ రైలును ప్రారంభించాలని కోరారు. తయారీ, సేవా రంగానికి ప్రధాన ప్రోత్సాహాన్ని అందించడానికి ఈస్ట్ కోస్ట్ ఎకనామిక్ కారిడార్‌లో కీలకభాగమై, జాతీయ ప్రాముఖ్యత కలిగిన 800 కిలోమీటర్ల పొడవైన విశాఖపట్నం - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ వెంట వందేభారత్‌ను ప్రవేశపెట్టాలని విజ్ఞప్తి చేశారు.

వ్యాపారులకు ప్రయాణాన్ని వేగవంతం చేస్తోందని, రెండు ప్రాంతాల మధ్య వ్యాపార అవకాశాలను సృష్టించడంతోపాటు సరఫరా గొలుసును ప్రోత్సహించి, అంతర్ రాష్ట్ర వ్యాపారాన్ని విస్తరించడానికి, ఉపాధి అవకాశాలు కల్పించడానికి సహాయపడుతుందని పేర్కొన్నారు. ఓడరేవు, పారిశ్రామిక కేంద్రంగా ఉన్న విశాఖపట్నం ఈ కొత్త రైలు వల్ల మరింత వృద్ధి అవుతుందని పేర్కొన్నారు. అలాగే సికింద్రాబాద్-తిరుపతి మధ్య పిడుగురాళ్ల-గుంటూరు మీదుగా మరో వందే భారత్ రైలును ప్రవేశపెట్టాలని అభ్యర్థించారు.

దళితులకు అండగా ఉంటాం

- సిపిఎం నాయకులు, మాజీ ఎంపి మధు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి




మంత్రి కాకాణికి సమస్యను వివరిస్తున్న మధు

నెల్లూరు జిల్లా దగదర్తి మండలంలో వైసిపి నేతలు, పోలీసుల అరాచకాలపై సిపిఎం నాయకులు, మాజీ ఎంపి పి.మధు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత కొంత కాలంగా ఈ మండలంలో దళితులపై జరుగుతున్న వరుస దాడుల నేపథ్యంలో సిపిఎం నేతలు, కార్యకర్తలతో కలిసి బాధిత గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. బాధితులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మైక్రో ఫైనాన్స్ బాధితులు మధును కలిసి వినతిపత్రం అందజేశారు. మైక్రో ఫైనాన్స్ ద్వారా రూ.50 వేలు అప్పు తీసుకుంటే దాదాపు రూ.రెండు లక్షల వరకు వసూళ్లు చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి నేతలతో కలిసి దళితుల పట్ల దగదర్తి ఎస్‌ఐ ఆరాచకంగా వ్యవహరిస్తున్నారని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఫిబ్రవరి ఎనిమిదిన మండలంలోని 32 గ్రామాలతో కలిసి దగదర్తిలో సదస్సు నిర్వహిస్తామని, దళితులకు సిపిఎం అండగా ఉంటుందని మధు భరోసానిచ్చారు.

మంత్రి కాకాణితో భేటీ

దగదర్తి మండలంలో దళితులపై జరుగుతున్న దాడులను మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దృష్టికి మధు తీసుకెళ్లారు. వైసిపి నేతలు, గ్రావెల్ మాఫియా చెలరేగిపోతున్నారని, స్థానిక ఎస్‌ఐ దళితులకు అండగా ఉండాల్సింది పోయి అధికారపార్టీనేతతో కలిసి వేధిస్తున్నారని మంత్రికి వివరించారు. అన్ని విషయాలపై విచారణ జరుపుతానని, ఎస్‌పితో మాట్లాడి ఎస్‌ఐపై చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. మధు వెంట సిపిఎం మాజీ జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, కెవిపిఎస్ నాయకులు ఉన్నారు.



గుంటూరుకు చెందిన బాబు, ఆపరేషన్ నిర్వహించిన వైద్యులు

సంకుచిత రాజకీయాలు వీడాలి

- పిసిసి అధ్యక్షులు రుద్రరాజు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

బిజెపి విచ్చిన్న రాజకీయాలను తిపికొట్టాలని పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర ముగింపు సందర్భంగా దానికి సంఘీభావం తెలుపుతూ శ్రీకాకుళం ఏడు రోడ్ల కూడలి నుంచి ఇందిరా విజ్ఞాన్ భవన్ వరకు శుక్రవారం పాదయాత్ర నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. బిజెపి అధికారంలోకి వచ్చాక మతాలు, కులాలు, ప్రాంతాల పేరిట దేశాన్ని విభజించాలని చూస్తోందని విమర్శించారు. వైసిపి ప్రభుత్వంలో ఉద్యోగులకు రక్షణ కరువైందన్నారు. రాష్ట్రంలో జిఒ 1 తీసుకొచ్చి రాజకీయ పార్టీల నాయకులను ఇబ్బందులకు గురిచేస్తోందని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల గొంతు వినాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని అన్నారు. చెత్తపై పన్ను విధించడంతోపాటు విద్యుత్ ఛార్జీల పెంచారని, పంచాయతీరాజ్ వ్యవస్థను అస్తవ్యస్తం చేశారని విమర్శించారు. సర్పంచ్, ప్రజాప్రతినిధులకు నిధులు, విధులుగానీ కేటాయించలేదని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై కాంగ్రెస్ పార్టీ తరపున పార్లమెంట్‌లో ప్రస్తావిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తోందని అన్నారు.

తగ్గిన పెన్షన్ ఫండ్స్ రాక

- స్థూల ఎఫ్‌పిఐల్లోనూ పతనం
- చైనా వైపు మొగ్గు

ముంబయి : గడిచిన ఏడాదిలో భారత మార్కెట్లోకి విదేశీ పోర్టు పోలియోలోని దీర్ఘకాలిక వనరుల్లో కీలకమైన పెన్షన్ ఫండ్స్ రాక భారీగా తగ్గింది. గతేడాది ఈ ఆస్తులు దాదాపు 13.3 శాతం లేదా రూ.57,242 కోట్లు తగ్గి రూ.3.7 లక్షల కోట్లకు పరిమితమయ్యాయి. ఇంతక్రితం ఏడాది 2021లో ఇవి రూ.4.3 లక్షల కోట్లుగా నమోదయ్యాయని డిపాసిటరీ డాటా విశ్లేషించింది. చైనా ఆర్థిక వ్యవస్థ తిరిగి తెరుచుకోవడంతో ఎఫ్ఐఐలు ఆ దేశానికి తరలిపోతున్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. గతేడాది భారత్‌లోకి విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పిఐ) స్థూల ఈక్విటీ పెట్టుబడులు 0.5 శాతం తగ్గి రూ.48.6 లక్షల కోట్ల నుంచి రూ.48.3 లక్షల కోట్లకు పడిపోయాయి. ఇదే సమయంలో బిఎస్ఇ సెన్సెక్స్ 4.4 శాతం పెరిగింది. 2022 ప్రథమార్థంలో భారీగా ఎఫ్‌పిఐలు తరలిపోయాయని సావరిన్ వెల్త్ ఫండ్స్, ఇతర గ్లోబల్ ఇన్స్‌ట్యూషన్లకు ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్, అడ్వైజరీ సర్వీస్‌ను అందించే ముంబయికి చెందిన కర్మ కాపిటల్ సిఇఒ రజ్నీష్ గిర్దర్ పేర్కొన్నారు. " గతేడాది జులై నుంచి తిరిగి భారత్‌కు ఎఫ్‌పిఐలు భారీగా వచ్చాయి. డిసెంబర్ చివరి రెండు వారాల వరకు ఇది కొనసాగింది. ఆ తర్వాత మళ్లీ తరలిపోవడం ప్రారంభించాయి. జనవరిలోనూ ఇదే కొనసాగింది. ద్వితీయార్థంలో చైనాపై కొంత ప్రతికూలత ఉండటంతో భారత్‌కు నిధుల రాక ఎక్కువగా ఉంది. ఇటీవల పరిస్థితులు మారడంతో తిరిగి మళ్లీ ఆ దేశం వైపు ఇన్వెస్టర్లు మొగ్గు చూపుతున్నారు." అని రజ్నీష్ పేర్కొన్నారు. భారత్‌పై విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు గతంలో ఉన్నంత ఎక్కువగా ఉండకపోవచ్చని.. చాలా వరకు చైనాపై ఆధారపడి ఉండవచ్చని ఇండిపెండెంట్ మార్కెట్ అనలిస్ట్ ఆనంద్ టాండన్ పేర్కొన్నారు. 2022లో విదేశీ పోర్టుపోలియో ఇన్వెస్టర్లు రూ.1.25 లక్షల కోట్ల నికర అమ్మకాలు చేపట్టారు. దేశీయ ఇన్వెస్టర్లు రూ.2.8 లక్షల కోట్ల నికర కొనుగోళ్లు చేశారు. కాగా.. జనవరిలో విదేశీ ఇన్వెస్టర్లు నికరంగా రూ.13,000 కోట్ల విలువైన స్టాక్‌లను విక్రయించగా.. దేశీయ సంస్థలు రూ.19,000 కోట్లకు పైగా కొనుగోలు చేశాయి.

ఎసిడిటి సమస్యకు శాశ్వత పరిష్కారం

- గుంటూరు జిజిహెచ్‌లో అరుదైన వ్యాధికి శస్త్ర చికిత్స

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

కడుపు భాగం, చిన్న ప్రేగు మొదటి భాగంలోకి చొచ్చుకుపోయిన నేపథ్యంలో అత్యంత అరుదైన, క్లిష్టమైన ఆపరేషన్ నిర్వహించి రోగిని ప్రాణాపాయ స్థితి నుంచి గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు కాపాడారు. ఈ మేరకు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి, జనరల్ మెడిసిన్ సర్జన్ వై.కిరణ్‌కుమార్ శుక్రవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. గుంటూరుకు చెందిన బాబు (65) అనే రోగి గత 15 ఏళ్లుగా కడుపులో మంట, పొట్ట బిగపట్టడం, ఆకస్మికగా ఊపిరి అందకపోవడం, ఆకలి లేకపోవడం, విపరీతంగా తేనుపులు రావడం, జీర్ణం కాకపోవడం వంటి లక్షణాలతో బాధపడుతున్నారు. గత ఏడాది ఈ సమస్యలు తీవ్ర రూపం దాల్చడంతో ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స చేయించారు. అయినా ఉపశమనం కలగకపోవడంతో గత నెల 19న గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలోని గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగంలో చేరారు. జనరల్ సర్జరీ నిపుణులైన డాక్టర్ కిరణ్‌కుమార్ పరీక్షలు నిర్వహించి కడుపులో భాగం చిన్నపేగు మొదటి భాగంలోకి టెలిస్కోప్ వలే చొచ్చుకొని పోయి ఉండడాన్ని గుర్తించి శస్త్ర చికిత్స చేశారు. ఆస్తమా ఉండటం వల్ల సిగరెట్లు తాగడంతో ఊపిరితిత్తుల పనితీరు సరిగా లేకపోవడంతో ఈ సమస్య వచ్చిందని వైద్యులు తెలిపారు. కడుపులో ఏర్పడిన గడ్డను శస్త్ర చికిత్స ద్వారా తొలగించినట్లు చెప్పారు. సమావేశంలో వైద్యులు కిరణ్ కుమార్, రమణా చలం, వెంకట రమణ, నాగ సంతోష్, వంశీధర్, నిఖిల్, కిషోర్, మహేష్ బాబు, ఆనంద్ బాబు, నికోలస్, కీర్తి పాల్గొన్నారు.

సంపాదకీయం

అదానీ అక్రమాలు

ప్రపంచంలోనే మూడవ అత్యంత ధనవంతునిగా ఖ్యాతికెక్కిన గౌతమ్ అదానీ వ్యాపార మోసాల పుట్ట పగిలింది. ఇంతకాలం ఆయన చక్కబెట్టిన అవినీతి, అక్రమాలు ఒక్కొక్కటిగా బయటికొస్తున్నాయి. అదానీ నెరపిన మార్కెట్ కుంభకోణాలను అమెరికాకు చెందిన ప్రముఖ పారిశ్రామిక పెట్టుబడుల పరిశోధన సంస్థ 'హిండెన్‌బర్గ్ రిసెర్చ్' రెండు రోజుల క్రితం తన నివేదిక ద్వారా ప్రపంచానికి చాటింది. దాంతో డబ్బు సంపాదనా పరులకు ఆదర్శంగా నిలిచిన అదానీ ఆర్థిక ఎదుగుదల వెనుక గల మోసపు బాగోతాల గుట్టు లోకానికి తెలిసొచ్చినట్లయింది. హిండెన్‌బర్గ్ రెండేళ్లపాటు శోధించి తయారు చేసిన ఈ నివేదిక బిజెపి, కార్పొరేట్ల కుమ్మక్కును మరోసారి బట్టబయలు చేసింది. షేర్లలో అవకతవకలకు, అకౌంట్స్‌లో మోసాలకు, మనీలాండరింగ్‌కు అదానీ గ్రూపు పాల్పడిందన్నది హిండెన్‌బర్గ్ నివేదిక సారాంశం. ఆ రిపోర్టులో లేవనెత్తిన పలు అంశాలు, ప్రశ్నలపై అదానీ సమాధానం చెప్పకుండా, తమను దెబ్బతీయడానికి చేసిన కుట్ర అని ఎదురుదాడి చేశారు. ప్రతిగా తమ నివేదికపై కట్టుబడి ఉన్నామని, ఎలాంటి చర్యలకైనా సిద్ధమని హిండెన్‌బర్గ్ చేసిన సవాల్‌పై అదానీ వైపు నుంచి స్పందన శూన్యం.

పైకి రోల్‌మోడల్స్‌గా కనిపించే నల్లకోటు కార్పొరేట్ల చీకటి దందాలు హిండెన్‌బర్గ్ నివేదికతో మరోసారి బహిర్గతం అయ్యాయి. అదానీ గ్రూపులోని ఏడు ప్రధాన కంపెనీల షేర్లను తిమ్మినిబమ్మిని చేసి కృత్రిమంగా ధరలు పెంచుతున్నారు. ఆ షేర్లను తాకట్టుపెట్టి బ్యాంకుల నుంచి అడ్డగోలుగా అప్పులు తెస్తున్నారు. అందినకాడికి పన్నుల ఎగవేతకు పాల్పడుతున్నారు. పన్ను ఎగవేతదారులకు అనుకూలంగా ఉన్న సింగపూర్, మారిషస్, కరీబియన్ దీవులు, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో డొల్ల కంపెనీలను ఏర్పాటు చేసి లాభాలను వాటిలోకి మనీలాండరింగ్ పద్ధతుల్లో తరలిస్తున్నారు. ఇటువంటి అక్రమాలతోనే అదానీ గ్రూపులోని షేర్లు ఎకాయెకిన 819 శాతం పెరిగాయి. నికర విలువ 231 శాతానికి ఎగబాకింది. మూడేళ్ల క్రితం గ్రూపు వర్త్ రూ.1.62 లక్షల కోట్లు కాగా ఇప్పుడు 9.78 లక్షల కోట్లు. ఈ స్వల్ప సమయంలో 8.1 లక్షల కోట్లు పెరగడం అసాధారణం. కరోనా విలయంతో ప్రజలు అల్లాడుతుండగా అదానీ సంపద అనూహ్యంగా పెరిగింది మోసాల నిచ్చెనతోనేనన్న విషయంలో ఎలాంటి సందేహం ఉండనవసరం లేదు. గతంలో సత్యం రామలింగరాజు కంపెనీదీ ఇదే బాపతు. హిండెన్‌బర్గ్ పేల్చిన బాంబుతో అదానీ కంపెనీ షేర్లు కుప్పకూలాయి. రూ.వేల కోట్ల విలువైన సంపద ఆవిరైంది. మొన్నటి వరకు ప్రపంచంలో మూడవ అత్యంత ధనవంతునిగా విరాజిల్లిన అదానీ రెండు రోజుల్లో ఏడవ స్థానానికి దిగజారాడు. షేర్ మార్కెట్‌లో సంపద గాలి బుడగ అనడానికి ఇదొక ఉదాహరణ. అదానీ గ్రూపులోని షేర్లలో 85 శాతం కుప్పకూలతాయని హిండెన్‌బర్గ్ చేసిన హెచ్చరికకు తాజా పరిణామం బలాన్ని చేకూరుస్తోంది.

హిండెన్‌బర్గ్ నివేదిక అదానీకో లేదంటే ఆ సంస్థల్లో పెట్టుబడులు పెట్టిన మదుపరులకో పరిమితం కాదు. మోడీ ప్రభుత్వానికీ పెద్ద కుదుపు. అదానీ-మోడీ మధ్య అవినాభావ సంబంధం బహిరంగం. 1988లో చిన్న ఎగుమతి, దిగుమతి కంపెనీతో వ్యాపారం ప్రారంభించిన అదానీకి 1991 నుంచి దేశంలో ప్రారంభమైన సరళీకరణ విధానాలు ఊపునిచ్చాయి. గుజరాత్ సిఎంగా మోడీ వచ్చాక అదానీ ప్రభ వెలిగింది. మోడీ దేశ ప్రధాని అయ్యాక అదానీ వాణిజ్య సామ్రాజ్యం అవధులు దాటింది. ఎయిర్‌పోర్టులు, పోర్టులు, రైల్వే, రోడ్లు, విద్యుత్, గ్యాస్, బొగ్గు, రియల్, ఒకటేమిటి... సకలం అదానీ వశమవుతున్నాయి. కేంద్ర బిజెపి ఆశ్రితపక్షపాతం లేకుండా అదానీ ఇంతగా ఎదగడం అసాధ్యం. శ్రీలంక, బంగ్లాదేశ్‌ల్లోనూ అదానీ మోనోపోలికి మోడీ సర్కారే కారణం. అదానీ పోర్టులు డ్రగ్స్ అక్రమ రవాణాకు కేంద్రాలుగా మారాయని వెల్లడైంది. ఇంతకుముందు అక్రమాలకు సంబంధించిన కేసులలో అదానీ కంపెనీలపై సెబి నిషేధం విధించగా, దానిని జరిమానా కింద మార్చి అదానీ బయట పడ్డారు. సెబి, ఆర్‌ఒసి, ఇడి, సిబిఐ, నిఘా సంస్థలు కొమ్ము కాస్తున్నందునే అదానీ మార్కెట్ మాయాజాలం సక్సెస్ అయింది. హిండెన్‌బర్గ్ రిపోర్టుతోనైనా కేంద్రం అదానీ ఆర్థిక అక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేయించాలి. ఆర్థిక నేరగాళ్లను బోనులో నిలబెట్టాలి.

మహనీయుల మాట



సమాజం కొద్ది మంది మీద ఆధారపడి నడవదు. లేదా అదృష్టం వల్లనో, విధి ఫలితం వల్లనో నడవదు. పౌరుల చైతన్యపూర్వక కార్యాచరణ వల్ల నడుస్తుంది.

- ఆంటోనియో గ్రాంసీ

నీవు నేర్పిన విద్యయే నరేంద్ర భాయి!

సందర్భం

పీపీ

సినిమాలపై అనవసర వ్యాఖ్యలు చేసి వివాదాలు పెంచవద్దని ప్రధాని నరేంద్ర మోడీ ఇటీవల బిజెపి జాతీయ కార్యవర్గ సమావేశంలో చెప్పడం బాగా ప్రచారం పొందింది. ఆలస్యంగానైనా మోడీ సరైన పిలుపునిచ్చారని కొందరు కొనియాడారు. సహజంగానే చిత్ర పరిశ్రమ సంఘాలు స్వాగతించాయి. ఆ ఉపన్యాసానికి కొద్దిగా ముందే మధ్యప్రదేశ్ మంత్రి నరోత్తమ్ మిశ్రా 'పఠాన్' సినిమా గురించి వివాదాస్పద వ్యాఖ్యలు చేసి దుమారం రేపారు. చాలాకాలం తర్వాత హిందీ తెరపై మళ్లీ తన స్థాయిలో పున:ప్రవేశం చేసిన షారుఖ్ ఖాన్, దీపికా పదుకునే నటించిన ఈ చిత్రం విడుదలకు ముందే 'బేషరమ్ రంగ్...' అనే ఒక పాట విడుదలైంది. అందులో నాయిక ధరించిన బికినీ కాషాయ రంగులో వుండటం సంఘ పరివార్ దాడికి కారణమైంది. ఇది పదిహేను సెకన్ల వ్యవహారం మాత్రమే. వారితోపాటు ఎప్పుడూ బిజెపికి వత్తాసుగా వుండే కేంద్రమంత్రి రామ్‌దాస్ అథవాలే కూడా వంత పాడారు. కాషాయం కేవలం బిజెపి రంగు మాత్రమే కాదు, గౌతమ బుద్ధుడు కూడా అవే ధరించేవాడు అంటూ తనకు తోచిన చరిత్ర చెప్పారు. ఇది పార్లమెంటులోనూ చర్చకు వచ్చింది. బిఎస్‌పి సభ్యుడు దానిష్ అలీ మాట్లాడుతూ సనాతన ధర్మం గానీ ఇస్లాం గానీ ఒక పాటతోనే కొట్టుకు పోయేంత బలహీనమైవని కావని వ్యాఖ్యానించారు. ఎందుకంటే ఈ పాటలో ఆకుపచ్చ రంగు వాడటంపై కూడా కొందరు మౌల్వీలు నిరసన తెలిపారట. బేషరమ్ రంగ్ అంటే సిగ్గులేని రంగు అనే పాటపదాలు కాషాయాన్ని అవమానిస్తున్నాయని వారి ఆరోపణ. అయితే పూర్తి పాట వింటే గనక నా అసలు రంగు మీకు తెలియదు అని అర్థం. కాని కావాలని చేసిన దుష్ప్రచారంతో ఆ పాటను, చిత్రాన్ని నిషేధించాలనే వరకూ కథ నడిచింది. ఈ మొత్తం పాట వేరే రంగులతో రీషూట్ చేయాలంటూ షారుఖ్ దీపికల ఫోటోలను దగ్ధం చేశారు. కొన్నేళ్లపోతే తాము మన సంస్కృతికి అనుగుణంగా వుండే రంగులనే ఉపయోగించేలా చేస్తాం గనక రంగు రాజకీయాలు చెల్లబోవని బిజెపి కార్పొరేటర్ వినోద్ మిశ్రా హెచ్చరించారు. ఒక రంగును సిగ్గులేనిదిగా చెప్పడమే తప్పు అని కూడా ఆయన సెలవిచ్చారు. మొత్తంపైన ఇది తీవ్ర వివాదంగానే పరిణమించింది.

ఈ వివాదంపై దర్శకుడు ఆనంద్ పట్వర్ధన్ మాట్లాడుతూ మితవాద పార్టీలు సినిమాను రాజకీయాల కోసం వాడుకుంటున్నాయని విమర్శించారు. వినోదం కోసం ఉద్దేశించిన సినిమాను మత రాజకీయాల కోసం వివాదంగా మారుస్తున్నారన్నారు. కాశ్మీర్ ఫైల్స్ వంటి చిత్రాన్ని కేవలం ఈ భావాల కోసమే ప్రోత్సహించారు. అది కేవలం ప్రచారం కోసం తీసిన సినిమా. ఆఖరుకు దాన్ని గోవా చలన చిత్రోత్సవంలోనూ తగాదాగా మార్చారు. ప్రచార చిత్రంగనక అవార్డుకు ఎంపిక చేయలేదని జ్యూరీ అధ్యక్షుడు చెబితే అతనిపై దాడి చేశారు. ఈత దుస్తుల్లో స్త్రీ శరీర కదలికలున్నాయని మతవాదులు ఎప్పుడూ గొడవ చేస్తుంటారు. కాని 'దిల్ వాలే' చిత్రంలోనూ 'రంగ్ దే తూ మోహె గేరువా...' అని పాట వుంది కదా. దానికి ఎలాంటి అభ్యంతరం రాలేదే? అని రచయిత శ్రీమోయి పి కుందు ప్రశ్న వేశారు. ఈ విషయం అలా వుంచితే షారుఖ్ ఖాన్ పాత వ్యాఖ్యలను కూడా తవ్వి తీసి వివాదం రగిలించే కుట్రలు చాలా జరిగాయి. సుశాంత్ రాజ్‌పుత్ ఆత్మహత్య తర్వాత కంగనా రనౌత్ వంటి వారు రేపిన రభస కారణంగా ఆమీర్ ఖాన్, సల్మాన్‌ఖాన్, షారుఖ్ ఖాన్‌లను బహిష్కరించాలనే రచ్చ చాలాకాలం నడిచింది. ఈ కారణంగా లాల్ సింగ్ చద్దా, రామ్ సేతు వంటి చిత్రాలు ఊహించినదానికన్నా చాలా ఘోరంగా దెబ్బతినిపోయాయి. బ్రహ్మాస్త్ర కూడా. వాస్తవానికి చివరి రెండు చిత్రాలు హిందూత్వ భావజాలానికి కొంత అనువుగా వున్నవే. అయితే వాటిలో నటించిన వారిపై విద్వేష ప్రచారంతో నడవకుండా చేశారు. ఇవన్నీ బాలీవుడ్‌ను కుదిపేశాయి.



ఇన్ని సవాళ్ల మధ్యనా ధైర్యంగానే పఠాన్ విడుదల చేశారు. చాలా కాలం తర్వాత వచ్చిన షారుఖ్ సినిమా వివాదాలన్నిటినీ తోసిపుచ్చి ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. అడ్వాన్స్ బుకింగ్స్‌తోనే పద్నాలుగు కోట్లు వసూలు చేసింది. నాలుగేళ్ల తర్వాత ఆయనకు లభించిన ఘన విజయం సంఘ పరివార్ ప్రచారాలను వారు పట్టించుకోలేదని చాటింది. బహుశా ప్రధాని హఠాత్తుగా మారిపోవడానికి ఇదో కారణం కావచ్చు. విశ్వహిందూ పరిషత్ కూడా నిరసనను ఉపసంహరించుకుంటున్నట్టు ప్రకటించింది. ఇక మొదట్లో చెప్పుకున్న మధ్యప్రదేశ్ మంత్రి కూడా చిత్రం సెన్సార్ సర్టిఫికెట్ పొందిన తర్వాత ఇంకా దాన్ని నిరసించడంలో అర్థం లేదని తోక ముడిచారు.

ఇదే సమయంలో కాశ్మీర్ ఫైల్స్‌ను ఆకాశానికెత్తారు. ఏకపక్ష హిందూత్వ భావజాలంతో తీసిన ఆ చిత్రాన్ని ఏకంగా ప్రధాని నరేంద్రమోడీ ఆకాశానికెత్తి ప్రచారం కల్పించారు. అదే కోవలో ఆర్‌ఆర్‌ఆర్‌కూ ఊతమిచ్చారు. అచ్చంగా అలాంటిదే కాకున్నా తెలుగు వీరుల గురించి ఊహలు జోడించి తీసిన ఈ చిత్ర కథకుడు విజయేంద్ర ప్రసాద్‌ను రాజ్యసభకే నామినేట్ చేశారు. దాంట్లో ఒక నాయకుడుగా నటించిన జూనియర్ ఎన్టీఆర్‌ను స్వయంగా అమిత్‌షా వచ్చి కలుసుకున్నారు. తనతో ఆరెస్సెస్ ఇతివృత్తంతో ఒక చిత్రం తీయనున్నట్టు సమాచారం. కాశ్మీర్ ఫైల్స్ నిర్మాతలే కార్తికేయ2 ద్వారకా నగర పురాణంతో తీశారు. బాహుబలి ప్రభాస్‌తో ఆదిపురుష్ తీస్తున్నారు కూడా. రంగస్థలం, పుష్ప చిత్రాల దర్శకుడు సుకుమార్ తోనూ ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇలా చెబుతూ పోతే సినిమా రంగంలో కాషాయ కథలజోరు బాగా పెరిగింది. ఇందుకు సమాంతరంగా షారుఖ్ వంటి వారిపై వ్యతిరేక ప్రచారమూ నడుస్తున్నది. ఇవన్నీ భరించలేకనే కోల్‌కతా చిత్రోత్సవంలో అమితాబ్ బచన్, షారుఖ్ ఖాన్‌లు గతంలోని చిత్రాలకూ ఇప్పటికీ తేడాను చెబుతూ ఆందోళన చెందారు.

ఇన్ని సవాళ్ల మధ్యనా ధైర్యంగానే పఠాన్ విడుదల చేశారు. చాలా కాలం తర్వాత వచ్చిన షారుఖ్ సినిమా వివాదాలన్నిటినీ తోసిపుచ్చి ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. అడ్వాన్స్ బుకింగ్స్‌తోనే పద్నాలుగు కోట్లు వసూలు చేసింది. నాలుగేళ్ల తర్వాత ఆయనకు లభించిన ఘన విజయం సంఘ పరివార్ ప్రచారాలను వారు పట్టించుకోలేదని చాటింది. బహుశా ప్రధాని హఠాత్తుగా మారిపోవడానికి ఇదో కారణం కావచ్చు. విశ్వహిందూ పరిషత్ కూడా నిరసనను ఉపసంహరించుకుంటున్నట్టు ప్రకటించింది. ఇక మొదట్లో చెప్పుకున్న మధ్యప్రదేశ్ మంత్రి కూడా చిత్రం సెన్సార్ సర్టిఫికెట్ పొందిన తర్వాత ఇంకా దాన్ని నిరసించడంలో అర్థం లేదని తోకముడిచారు. అందితే జుట్టు అందకపోతే కాళ్లు అనే ఫాసిస్టు నీతిని అమలు చేశారు. షారుఖ్ ఖాన్ విజయం పట్ల బాలీవుడ్‌లో ఆయన సన్నిహితులు, అభిమానులు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. కరణ్ జోహార్ ప్రత్యేకంగా వ్యాసం రాశారు. ప్రకాశ్‌రాజ్ ఈ చిత్రం విజయాన్ని, వసూళ్లను గురించి ట్వీట్ చేశారు. ఇక జావేద్ అక్తర్ ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ బాయ్‌కాట్ బాలీవుడ్ వంటి వాటిని గురించి మాట్లాడ్డమే దండగని, అవి పని చేయవనీ కొట్టిపారేశారు. షారుఖ్ పెద్దమనిషి మాత్రమేగాక నేను ఎంత లౌకికవాదిగా వున్నానో ఆయనా అంతేనని మెచ్చుకున్నారు.

ఇవన్నీ ప్రజలకూ పరిశ్రమకూ వున్న లౌకిక ధోరణులు చెబుతాయన్నది నిజమే. అయితే ఇదే సమయంలో కనిపిస్తున్న ఆందోళనకరమైన ఇతర కోణాలను విస్మరిస్తే పొరబాటవుతుంది. సినిమా వివాదాలు వద్దని చెప్పినందుకు మోడీని మెచ్చుకుంటున్న సమయంలోనే 'మోడీ క్వశ్చన్' పేరిట బిబిసి తీసిన డాక్యుమెంటరీని నిషేధించారు. వాటిని ప్రసారం చేయకుండా ట్విటర్, యూట్యూబ్, ఫేస్‌బుక్‌లను ఆదేశించారు. వాస్తవానికి బ్రిటిష్ ప్రభుత్వ అధికారిక సమాచారం మేరకు తీసిన ఆ డాక్యుమెంటరీలో కల్పన ఏదీ లేదు. ఆ కాలంలో గుజరాత్ ముఖ్యమంత్రిగా వున్న మోడీ సర్కారు గురించిన వాస్తవాలను వెల్లడించింది. అప్పట్లో జరిగిన విచారణలనూ విమర్శలనూ వినిపించింది. బ్రిటిష్ మాజీ హోం మంత్రి అందులో మాట్లాడారు. అయినా సరే అవన్నీ దుష్ప్రచారాలంటూ దేశంలో ప్రసారం కానివ్వలేదు. అయితే ఇతర మార్గాలలో అందుబాటులో వున్న ఇతర మార్గాలలో చిత్రం డౌన్‌లోడ్ చేసుకున్న ఎస్‌ఎఫ్‌ఐ వంటి సంస్థలు ప్రదర్శన ఏర్పాటు చేశాయి. గతంలో నిర్బంధానికి గురైన జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వంటి చోట్ల ప్రదర్శనలపై పోలీసులు విరుచుకుపడ్డారు. అంతకన్నా దారుణం ఎబివిపి వంటి సంస్థలు దీనికి పోటీగా కాశ్మీర్ ఫైల్స్ ప్రదర్శన నిర్వహించారు. కళారంగంలో భిన్న శక్తుల ఘర్షణకు ఇంతకు మించిన ఉదాహరణ అక్కర్లేదు. దీపికా పదుకునే జెఎన్‌యు పోరాటానికి కొన్నేళ్ల కిందట సంఘీభావం చెప్పడం కూడా పఠాన్ పాటపై దాడికి ఒక కారణం. ఇంతకూ ఈ చిత్రంలో ప్రకంపనాలు పుట్టించిన 'బేషరమ్...' పాటలో స్పానిష్ చరణాలు పాడిన కారాలిసా మాంటెరో మాట్లాడుతూ-ఈ దేశంలో బికినీ పాటపై వివాదాన్ని మించిన సమస్యలు చాలా వున్నాయన్నారు. కాషాయం రంగును జాతీయ జెండాలో చూడటం ఒక్కటే నాకు గుర్తున్న విషయం. దాన్ని ధైర్యానికి, నిస్వార్థతకు చిహ్నంగా భావిస్తాము. మధ్యప్రదేశ్ మంత్రిగారికి అదే ఎందుకు పెద్ద సమస్య అయిందో నాకు తెలియదు- అన్నారు. కారాలిసా గతంలో దిల్ చాహతా హై చిత్రంలో పాట పాడటంతో బాగా పాపులర్ అయిన గాయని. ఇలాంటి సానుకూల వ్యాఖ్యలు, వాస్తవాలు ఎన్నయినా ఇవ్వచ్చు. కానీ అవేవీ మన పాలకులకు అవసరంలేదు. సినిమాలే గాక ఇప్పుడు సోషల్ మీడియాలో వార్తలను కూడా ప్రెస్ ఇన్ఫర్‌మేషన్ బ్యూరో తప్పని చెబితే తీసేస్తామని ప్రకటించారు. అయినా మీడియా కళ్లు తెరవకుండా స్వీయ సెన్సార్‌షిప్ పాటిస్తోందని సాయినాథ్ తీవ్రంగా ఆక్షేపించారు.

గాంధీలు, గాడ్సేలు

మొత్తంపైన వెనక్కు తిరిగిచూసుకుంటే 2022లో బాయ్‌కాట్ బాలీవుడ్, బాయ్‌కాట్ విక్రమ్ వేద, బాయ్‌కాట్ పఠాన్...అంటూ వచ్చిన పిలుపులు పరిశ్రమను కుదిపేశాయి. ఈ సమయంలోనే దక్షిణాది చిత్రాల అఖండ విజయాలు బాలీవుడ్‌కు ఆందోళన కలిగించాయి. ప్రపంచ దేశాలను ఆకర్షించే దశకు చేరాయి. మన ఎగుమతులలో కాస్తాకూస్త సొమ్ములు తెచ్చేది చిత్రాలే, మన నిర్మాణాల సంఖ్య ప్రపంచంలోనే అత్యధికం. ఇంగ్లీషు వారికి మన మార్కెట్ కూడా ఎక్కువే. ఈ సమయంలో బహిరంగ వివాదాలు, బాయ్‌కాట్లు దేశానికే హానికరమని ఆర్థికవేత్తలూ పరిశ్రమ వర్గాలు కూడా గుర్తించక తప్పని స్థితి. అదే సెగ ప్రధానినీ తాకినట్టుంది. కాని నిజంగా మార్పు లేదనడానికి గాంధీ గాడ్సే చిత్రం ఒక ఉదాహరణ. వివాదాల వల్ల మన గొప్పతనం చెప్పుకోలేకపోతున్నామని మోడీ అన్నది వచ్చే ఎన్నికల కోణం తప్ప ప్రజాస్వామ్య స్ఫూర్తి ఎంతమాత్రం కాదు! అందుకే పారాహుషార్ మరి! ★

చర్చ

వందే భారత్ సామాన్యుడికి అందేనా...



వందే భారత్ రైలు 130 కిలోమీటర్ల వేగంతో అత్యంత వేగంగా గమ్యానికి చేరుస్తుందని ఇదొక గొప్ప విజయమని రైల్వేశాఖ ప్రకటించింది. దేశ ప్రధానమంత్రితో పాటు ఇద్దరు కేంద్ర మంత్రులు, గవర్నర్ అందరూ పండగవేళ ఆ రైలు గురించే మాట్లాడారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు నిజమైన పండగ వచ్చిందని ప్రధానమంత్రి అభివర్ణించారు. అయితే ఇక్కడ ఆలోచించాల్సిన విషయమేమిటంటే...సికింద్రాబాద్ నుంచి విజయవాడకు 905 రూపాయల చార్జీ ఉంది. సాధారణంగా సూపర్ ఫాస్ట్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో చార్జి 172 రూపాయలే కాగా, అవి గమ్యస్థానానికి ఆరు గంటల్లో చేరుస్తాయి. వందే భారత్ రైలుకు సికింద్రాబాద్ నుంచి విజయవాడకు నాలుగు గంటల సమయం పడుతోంది. ఇతర రైళ్లకు, వందే భారత్‌కు తేడా కేవలం రెండు గంటలు మాత్రమే. ఆ రెండు గంటల సమయం కోసం అదనంగా 725 రూపాయలు చెల్లించుకోవాలా? వందేభారత్‌లో విమానం తరహాలో సదుపాయాలు ఉన్నాయని ఎంతగా ఊదరగొట్టినప్పటికీ ప్రయాణికుల నుంచి ఆశించిన స్పందన లేదు. సికింద్రాబాద్ నుంచి విశాఖకు నడిపే సూపర్‌ఫాస్ట్ రైళ్లలో దురంతో ఎక్స్‌ప్రెస్ అతి ముఖ్యమైనది. దీనిలో ఫస్ట్ ఎసి, సెకండ్ ఎసి, థర్డ్ ఎసి కోచ్‌లు ఉంటాయి. అన్నీ స్లీపర్ బెర్తులే. దురంతోలో ఫస్ట్ ఎసి టికెట్ ధర 2,800 రూపాయలు, సెకండ్ ఎ.సి 2,300 రూపాయలు, థర్డ్ ఎ.సి 1,630 రూపాయలుగా ఉంది. ఈ ఎక్స్‌ప్రెస్ కూడా గంటకు 130 కిలోమీటర్ల నుంచి 140 కిలోమీటర్ల వేగంతో వెళ్తుంది. సికింద్రాబాద్ నుంచి విజయవాడ మీదుగా విశాఖకు 10 గంటల 10 నిమిషాల వ్యవధిలో చేరుకుంటుంది. ఇక వందే భారత్ రైలు ఎగ్జిక్యూటివ్ క్లాస్‌లో సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నంకు 3,170 రూపాయలుగా ఉంది. ఇందులో స్లీపర్ బెర్తులు ఉండవు. అన్నీ చైర్ సీటింగ్ మాత్రమే. సికింద్రాబాద్ నుంచి 8.30 గంటల ప్రయాణంతో విశాఖకు చేరుకోవచ్చు. దురంతోతో పోల్చుకుంటే గంటా 40 నిమిషాలు ముందుగా వందేభారత్‌లో ప్రయాణించవచ్చు.

ఇవన్నీ చూసిన తర్వాత సగటు ప్రయాణికుడు వందేభారత్ కంటే దురంతో వైపే ఆసక్తి చూపిస్తున్నాడు. గంటన్నర వ్యత్యాసానికి అంత డబ్బు చెల్లించి, అదీ స్లీపర్ బెర్తులు లేకుండా చైర్‌లో కూర్చొని వందేభారత్‌లో వెళ్లే కంటే ఇతర సూపర్ ఫాస్ట్ రైళ్లలో ప్రయాణించడం మేలని ప్రయాణికులు భావిస్తున్నారు. వందేభారత్‌లో 1,128 సీటింగ్‌కు కాను 1,050 సీట్లు చైర్ కార్ సదుపాయంతో ఉన్నాయి. మిగిలినవి ఎగ్జిక్యూటివ్ క్లాస్‌కు కేటాయించారు. ఎగ్జిక్యూటివ్ క్లాసులో ఏకంగా 400 రుపాయలు వరకు చార్జీ చేస్తున్నారు. విశాఖ నుంచి హైదరాబాద్ వెళ్లడానికి పది రోజుల ముందు బుక్ చేసుకుంటే విమానం టికెట్ 3,900 రూపాయలకే లభిస్తుంది. ప్రయాణ సమయం గంట మాత్రమే. అదే వందే భారత్ రైలులో ఎగ్జిక్యూటివ్ క్లాస్ టికెట్‌కి 3,170 రూపాయలు తీసుకుంటున్నారు. ప్రయాణ సమయం 8.30 గంటలు. ఇంకో 700 రూపాయలు అదనంగా పెడితే విమానం ఎక్కి ఏకంగా ఏడు గంటల సమయం ఆదా చేసుకోవచ్చు.

ఈజిప్టు లో గంటకు 230 కిలోమీటర్లు, మొరాకో లో 320 కిలోమీటర్లు, జపాన్ లో 374 కిలోమీటర్లు, ఫ్రాన్స్‌లో 357 కిలోమీటర్లు, స్పెయిన్‌లో 400 కిలోమీటర్లు, చైనాలో 420 కిలోమీటర్ల వేగంతో వెళుతున్న రైళ్ళను ఉపయోగిస్తుంటే మనం గంటకు 300 కిలోమీటర్ల వేగాన్నైనా ఎప్పటికి చేరుకుంటాం? ఒకవేళ చేరుకుంటే సామాన్యుడు ప్రయాణించగలడా?

- యం.ఎ. జబ్బార్
సెల్: 9177264832

★

కవిత్వం

అర్ధాకలి కాదు శుభకరం

వందే భారతం
వంద గదుల ఇంద్రభవనం
ప్రపంచ వీధుల్లో
ప్రకాశించు ప్రజాస్వామ్య చిహ్నం
వంకలేని పాలనం
వందమంది సోదరులం
అందరం హక్కుదారులం
అయినా సగం మంది తలదాచగ
మూలనున్న మూడు గదుల నిచ్చినాం
పది మంది పవళింపగ
డెబ్బై ఏడు గదులనుంచినాం
పాడిపంటల నా దేశం..
ఇంటి నిండా ధాన్యం
అయినా జన కోటికి
కూటికి నోచుకోని దైన్యం
ఒక్కడు తినడానికి
నలభై విస్తళ్లు పరిచినాం
ఏభై మందికి కలిపి
మూడు పిడికిళ్లు పెట్టినాం
వ్యత్యాసాల ఈ విధానం
మార్చడమే అత్యవసరం
అధిక జనుల అర్ధాకలి
కానేరదు శుభకరం
అందరి అభివృద్ధియే
నిజానికి నాగరికం
దేశానికి సౌభాగ్యకరం.


(దేశ సంపదలో పది శాతం మంది చేతిలో 77 శాతం, ఒక శాతం చేతిలో 40 శాతం వాటాలుండగా ...యాభై శాతం మంది కేవలం 3 శాతం వాటా కలిగి వున్నారని చెప్తున్నాయి గణాంకాలు.)

- డా. డి.వి.జి.శంకరరావు,
సెల్ : 94408 36931.

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

సమస్య

ప్రజారోగ్యానికి పెనుసవాలు



ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలలో పెరుగుతున్న యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఎఎంఆర్) ప్రజారోగ్యానికి పెను సవాలు విసురుతోంది. యాంటీ బయాటిక్స్ వాడకంతో శరీరంలో రోగనిరోధక శక్తి తగ్గడాన్నే యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఎఎంఆర్) అంటారు. సాంక్రమిత (అంటు) వ్యాధుల నిర్వహణలో అనేక సమస్యలకు దారి తీసి, పేషెంట్లను తీవ్ర అనారోగ్యం పాలు చేస్తుంది. దీంతో పాటు వారి వైద్య వ్యయాన్ని, జీవిత కాలాన్ని కూడా ప్రభావితం చేస్తోంది. ఎఎంఆర్ కారణంగా ప్రపంచ వ్యాప్తంగా ఏటా మృత్యువాత పడుతున్న వారి సంఖ్య 7 లక్షలకు పైగా వుంటుందని అంచనా. ఇందులో ఆస్పత్రుల ద్వారా సంక్రమించిన ఇన్ఫెక్షన్ల బారినపడి మరణించిన వారి సంఖ్య 99 వేలు. దీనితో పాటు ఆరోగ్య సేవల వ్యయం, దెబ్బతింటున్న ఉత్పాదకత వంటి అంశాలతో ఈ ఎఎంఆర్...ఒక్క అమెరికాపైనే 2050 నాటికి ఏటా 10 వేల కోట్ల డాలర్ల ఆర్థిక భారాన్ని మోపనుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ఎఎంఆర్ కారణంగా అల్పాదాయ, మధ్యాదాయ దేశాలలో 90 శాతం మేర మరణాలు సంభవిస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఈ అల్పాదాయ మధ్యాదాయ దేశాలతో పోలిస్తే ఎఎంఆర్ సంబంధిత ఇన్ఫెక్షన్ భారం మన దేశం మీదే ఎక్కువగా పడుతోంది. వివిధ రకాల సూక్ష్మ జీవులతో పాటు వాటిని అంతం చేసేందుకు పెరుగుతున్న యాంటీబయాటిక్స్ వాడకం కూడా ఇందుకు కారణమని ల్యాబ్ రిపోర్టులు చెబుతున్నాయి

ఎఎంఆర్ పెరిగిపోతే ఆరోగ్య పరిరక్షణ కూడా ఆర్థిక భారంగా మారుతుంది. ఇది వ్యక్తులకే కాదు... ఆరోగ్య వ్యవస్థలకు, దేశాలకూ వర్తిస్తుంది. ఎఎంఆర్ పెరిగితే ఉత్పాదకత తగ్గుతుంది. ఫలితంగా వేతనాలు కూడా తగ్గిపోతాయి. అంతేకాదు ప్రాణాలు కూడా పోయే ప్రమాదం పొంచి వుంది. 2050 నాటికి యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఎఎంఆర్) కారణంగా ప్రపంచ జీడీపిలో 3.5 శాతం మేర గండి పడుతుందని తాజా అంచనాలు హెచ్చరిస్తున్నాయి.

ఈ సమస్యను ఎదుర్కొనేందుకు ప్రభుత్వాలు పటిష్టమైన చర్యల్ని తీసుకోవాల్సిన అవసరముంది. మన దేశంలో విచక్షణా రహితంగా యాంటీబయాటిక్స్‌ను ఉపయోగించటం, డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లేకుండా మెడికల్ షాపుల్లో కొనసాగుతున్న కౌంటర్ విక్రయాలు ఎఎంఆర్ పెరిగిపోతుండటానికి కారణాలుగా చెప్పవచ్చు. పరిశుభ్రమైన తాగునీటి కొరత, పారిశుధ్య లోపం, వ్యక్తిగత పరిశుభ్రత కొరవడడం వంటి అంశాలు ఇందుకు ఆజ్యం పోస్తున్నాయి.


ఎఎంఆర్ కట్టడిలో ఐక్యరాజ్య సమితికి చెందిన ప్రపంచ ఆహార వ్యవసాయ సంస్థ, ప్రపంచ ఆరోగ్య సంస్థ, ప్రపంచ పశుసంక్షేమ సంస్థ వంటి విభాగాలు భాగస్వాములయ్యేందుకు ముందుకొచ్చాయి. మన కేంద్ర ప్రభుత్వం కూడా 2017లో జాతీయ స్థాయి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది. జాతీయ వ్యాధి నియంత్రణా సంస్థ (ఎన్సిడిసి) మార్గదర్శకత్వంలో పలు రాష్ట్రాలు సైతం తమ స్థాయిలో కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేశాయి. విచక్షణా రహితంగా పెరుగుతున్న యాంటీ బయాటిక్స్ వాడకాన్ని అడ్డుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాల్సి వుంది.

- కె.వి.రమణమూర్తి,
సీనియర్ పాత్రికేయులు.

★

మీ సామర్థ్యంపై విశ్వాసం ఉంచండి

- 'పరీక్షా పే' చర్చలో విద్యార్థులతో మోడీ



న్యూఢిల్లీ : విద్యార్థులు తమ శక్తి సామర్థ్యాలపై విశ్వాసం ఉంచాలని ప్రధాని మోడీ సూచించారు. ఎల్రక్టానిక్ పరికరాల (గాడ్జెట్స్) కన్నా విద్యార్థులు సమర్థవంతులని.. వాటిని తెలివిగా, స్మార్ట్‌గా వినియోగించాలని అన్నారు. శుక్రవారం నిర్వహించిన "పరీక్షా పే చర్చ" కార్యక్రమంలో ప్రధాని మోడీ విద్యార్థులతో మాట్లాడారు. భారతదేశంలోని ప్రజలు సగటున ఆరుగంటలపాటు ఎల్రక్టానిక్ పరికరాలను చూస్తున్నారని, అందువల్ల తయారీదారులకు లబ్ధి కలుగుతుందని చెప్పారు. ఈ పరిస్థితి ప్రజల సృజనాత్మకతను అడ్డుకుంటుందని తెలిపారు. గాడ్జెట్స్‌కి బానిసలు కాకూడదని అన్నారు. కాలం మారుతున్నదని... అడుగడుగునా పరీక్షలను రాయాల్సి వుంటుందని, చీటింగ్‌తో ఒకటి రెండు పరీక్షల్లో విజయం సాధించవచ్చు కానీ, జీవితంలో ఎప్పటికీ ఉత్తీర్ణత సాధించలేరని అన్నారు. విద్యార్థులు తమ సామర్థ్యాన్ని ఎప్పుడూ తక్కువ అంచనా వేయకూడదని చెప్పారు. ప్రతి ఒక్కరిలోనూ నైపుణ్యాలు ఉంటాయని... వాటి గురించి తెలుసుకోవాలని అన్నారు.

దేశంలో 2967 పులులు

- సుప్రీంకు తెలిపిన కేంద్రం

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా ఉన్న 53 టైగర్ రిజర్వ్ ఫారెస్టుల్లో 2,967 పులులు ఉన్నాయి. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం శుక్రవారం సుప్రీంకోర్టుకు వెల్లడించింది. 2018 లెక్కల ప్రకారం దేశంలో 2,967 పులులు ఉన్నాయని, ఇది ప్రపంచ పులుల సంఖ్యలో 70 శాతమని తెలిపింది. దేశంలో పులుల రక్షణ గురించి 2017లో న్యాయవాది అనుపమ్ త్రిపాఠి వేసిన పిటీషన్ విచారణలో కేంద్రం ఈ విషయాన్ని వెల్లడించింది. పులుల సంరక్షణకు, వాటి జనాభా పెంపునకు చాలా కృషి చేశామని కేంద్ర ప్రభుత్వం తరపున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి తెలిపారు. జస్టిస్ కెఎం జోసెఫ్, జస్టిస్ బివి నాగరత్నతో కూడిన ధర్మాసనానికి ఈ విషయాన్ని తెలిపారు. పిటిషన్ వేసిన న్యాయవాది త్రిపాఠి శుక్రవారం ఈ కేసు విచారణకు హజరుకాకపోవడంతో విచారణను మార్చి 3వ ధర్మాసనం వాయిదా వేసింది

ఢిల్లీ మద్యం కుంభకోణం శరత్ చంద్రారెడ్డికి బెయిల్

- 14 రోజులకు బెయిల్ మంజూరు చేసిన సిబిఐ కోర్టు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఇడి నమోదు చేసిన కేసులో అరబిందో శరత్ చంద్రారెడ్డికి మధ్యంతర బెయిల్ మంజూరైంది. రౌస్ అవెన్యూలోని సిబిఐ ప్రత్యేక కోర్టులో శుక్రవారం బెయిల్ పిటిషన్ ను జస్టిస్ ఎంకె నాగ్ పాల్ ధర్మాసనం విచారించి బెయిల్ మంజూరు చేసింది. రూ.2 లక్షల పూచీకత్తుపై 14 రోజులపాటు బెయిల్ మంజూరు చేసింది. శరత్ చంద్రారెడ్డి నానమ్మకు కర్మకాండలు జరపాల్సిన నేపథ్యంలో మధ్యంతర బెయిల్ ఇచ్చినట్లు తెలిపింది. నానమ్మ అంత్యక్రియలు, కర్మకాండల కార్యక్రమాల్లో పాల్గొనేందుకు రెండు వారాల బెయిల్ ఇవ్వాలని శరత్ చంద్రారెడ్డి తరపు న్యాయవాది కోరారు. శరత్ తండ్రి విదేశాల్లో ఉండేవారని, నానమ్మ దగ్గరే శరత్ పెరిగాడని, ఆమె చివరి కోరిక మేరకు ఆమె అంత్యక్రియల్లో పాల్గొనేందుకు శరత్ చంద్రారెడ్డికి బెయిల్ ఇవ్వాలని కోరారు. గతంలో సుప్రీంకోర్టు తీర్పులను అనుసరించి శరత్ రెడ్డికి బెయిల్ ఇవ్వాల్సిన అవసరం లేదని ఇడి తరపు న్యాయవాది వాదించారు.

గాజాపై ఇజ్రాయిల్ వైమానిక దాడులు

జెరూసలేం : గాజాపై ఇజ్రాయిల్ శుక్రవారం వైమానిక దాడులతో విరుచుకుపడింది. గురువారం ఓ వృద్ధ మహిళసహా తొమ్మిది మంది పాలస్తీనీయుల్ని ఇజ్రాయిల్ సైన్యం కాల్చి చంపిన తరువాత రోజే గాజాలోని అల్ మఘజీ శరణార్థుల శిబిరంపై ఇజ్రాయిల్ కనీసం 13 దాడులకు తెగబడటం గమనార్హం.

ఛేదనలో చతికిల

- రాంచి టీ20లో భారత్ ఓటమి

రాంచి : భారత పర్యటనలో న్యూజిలాండ్ బోణీ కొట్టింది. రాంచి టీ20లో భారత్‌పై 21 పరుగుల తేడాతో విజయం సాధించింది. మంచు ప్రభావంలోనూ 176 పరుగుల స్కోరును కాపాడుకున్న కివీస్ బౌలర్లు.. టీ20 సిరీస్‌లో ఆ జట్టును 1-0తో ముందంజలో నిలిపారు. స్పిన్నర్ మిచెల్ శాంట్నర్ (2/11), మైకల్ బ్రాస్‌వెల్ (2/31), లాకీ ఫెర్గుసన్ (2/33) రాణించటంతో 177 పరుగుల ఛేదనలో భారత్ 155 పరుగులకే పరిమితమైంది. వాషింగ్టన్ సుందర్ (50, 28 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సులు), సూర్యకుమార్ (47, 34 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సులు) పోరాటం సరిపోలేదు. అంతకుముందు, టాప్ ఆర్డర్‌లో ఓపెనర్ డెవాన్ కాన్వే (52, 23 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్), లోయర్ ఆర్డర్‌లో డార్లీ మిచెల్ (59 నాటౌట్, 30 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సులు) అర్థ సెంచరీలతో చెలరేగారు. టీ20 సిరీస్‌లో రెండో మ్యాచ్ ఆదివారం లక్నోలో జరుగనుంది.

బ్యాటర్లు విఫలం : 177 పరుగుల ఛేదనలో భారత బ్యాటర్లు విఫలమయ్యారు. గిల్ (7), కిషన్ (4), త్రిపాఠి (0) కొత్త బంతిని ఎదుర్కోవటంలో తేలిపోయారు. సూర్యకుమార్ (47), హార్దిక్ పాండ్య (21) కీలక భాగస్వామ్యంతో భారత్‌ను రేసులోకి తీసుకొచ్చారు. కానీ వరుస వికెట్లు మళ్లీ భారత్‌ను దెబ్బతీసింది. వాషింగ్టన్ సుందర్ (50) అర్థ సెంచరీ సాధించినా, అప్పటికే భారత్ ఓటమి ఖరారైంది.

విద్యార్థుల నిర్బంధం

- ఢిల్లీ, అంబేద్కర్ యూనివర్సిటీల్లోనూ జెఎన్‌యు సీన్ రిపీట్
- సెక్షన్ 144 విధింపు..విద్యుత్ సరఫరా కట్
- మోడీపై బిబిసి డాక్యుమెంటరీ ప్రదర్శనను నిషేధిస్తూ ఆదేశాలు
- 24 మంది అదుపులోకి.. అయినా వెనక్కి తగ్గని విద్యార్థులు



విశాఖ ఆంధ్రాయూనివర్శిటీలో బిబిసి డాక్యుమెంటరీని వీక్షిస్తున్న విద్యార్థులు

న్యూఢిల్లీ : భారత్‌లోని అగ్రస్థాయి విశ్వవిద్యాలయాలైన ఢిల్లీ, అంబేద్కర్ యూనివర్సిటీలలో జెఎన్‌యు సీన్ రిపీట్ అయింది. ప్రధాని మోడీపై బిబిసి డాక్యుమెంటరీ సిరీస్‌ను వీక్షించడానికి సిద్ధమైన విద్యార్థులను వర్సిటీ యంత్రాంగాలు, పోలీసులు అడ్డుకున్నారు. బిబిసి సిరీస్ ప్రదర్శనకు సిద్ధమైన ఢిల్లీ యూనివర్సిటీలో విద్యార్థులు అధిక సంఖ్యలో గుమిగూడటాన్ని, బహిరంగంగా స్క్రీనింగ్‌ను నిషేధిస్తూ సెక్షన్ 144 ను విధించారు. ఇటు అంబేద్కర్ యూనివర్సిటీలోనూ డాక్యుమెంటరీ ప్రదర్శనకు సిద్ధమైన వేళ యంత్రాంగం విద్యుత్ సరఫరాను నిలిపివేసింది.

సెక్షన్ 144 విధింపు.. విద్యార్థుల నిరసనలు

వర్సిటీ యంత్రాంగాల తీరు అక్కడి విద్యార్థుల్లో ఆగ్రహాన్ని తెప్పించింది. రెండు యూనివర్సిటీలలో విద్యార్థులు నిరసన తెలిపారు. నినాదాలు వినిపించారు. విద్యార్థుల నిరసనను అణగదొక్కేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. వీరిలో చాలామంది విద్యార్థులను పోలీసులు నిర్బంధించారు. దీంతో వర్సిటీలో విద్యార్థులు, పోలీసులకు మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది.

పోలీసుల అదుపులో ఢిల్లీ వర్సిటీ విద్యార్థులు

144ను నిరసిస్తూ, ఢిల్లీ యూనివర్శిటీ ఆర్ట్స్ ఫ్యాకల్టీ క్యాంపస్‌లో శుక్రవారం సాయంత్రం 5:30 గంటలకు డాక్యుమెంటరీని ప్రదర్శించడానికి ఏర్పాట్లు చేశారు. వీక్షించడానికి పెద్దసంఖ్యలో విద్యార్థులు తరలివచ్చారు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన పోలీసులు విద్యార్థుల పట్ల దారుణంగా ప్రవర్తించారు. ఈడ్చుకుంటూ తీసుకెళ్లారు. 24 మంది విద్యార్థులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీస్ ఇన్‌ఛార్జ్ సాగర్ సింగ్ కల్సి తెలిపారు.

పోలీసులు, వర్సిటీ యంత్రాంగాలు తమ అధికార, అంగ బలాన్ని ఉపయోగించి డాక్యుమెంటరీ ప్రదర్శనను అడ్డుకోవాలని చూసినా.. విద్యార్థులను ఆపలేకపోయాయి. జెఎన్‌యులో లాగానే.. డాక్యుమెంటరీకి సంబంధించిన క్యూఆర్ కోడ్ లింక్‌ను షేర్ చేసుకొని విద్యార్థులు తమ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లలో వీక్షించారు.

క్యాంపస్‌లో పబ్లిక్ స్క్రీనింగ్‌ను అనుమతించబడదని, ఈ విషయంలో ఢిల్లీ పోలీసులకు తాను లేఖ రాసినట్టు, వారు (పోలీసులు) చర్యలు తీసుకుంటారని ఢిల్లీ యూనివర్సిటీ ప్రొక్టార్ రజిని అబ్బి తెలిపారు.

ఇటు జామియా మిలియా ఇస్లామియాలో విద్యార్థులు తరగతులు బహిష్కరించారు. స్క్రీనింగ్‌కు కొందరు విద్యార్థులు ప్రయత్నించారనీ, యూనివర్సిటీ పూర్తిగా విఫలమైందని వైస్ చాన్సలర్ నజ్మా అక్తర్ వ్యాఖ్యలు చేసిన తర్వాతి రోజు విద్యార్థులు తరగతులు బహిష్కరించటం గమనార్హం. ఈ యూనివర్సిటీలో డాక్యుమెంటరీ ప్రదర్శనకు ప్రయత్నించిన 13 మంది విద్యార్థులను ఢిల్లీ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్న విషయం విదితమే.

గుజరాత్ అల్లర్లలో మోడీ పాత్రకు సంబంధించి బీబీసీ విడుదల చేసిన డాక్యుమెంటరీ " ఇండియా : ద మోడీ క్వశ్చన్" భారత్‌లో రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతున్న విషయం తెలిసిందే. దేశంలో ఎస్ఎఫ్ఐ మొదలుకొని పలు విద్యార్థి సంఘాలు ఇప్పటికే ఈ డాక్యుమెంటరీ ప్రదర్శనను పలు యూనివర్సిటీల్లో జరిపాయి. మరికొన్ని వర్సిటీలు, విద్యాసంస్థలు, ఇతర ప్రదేశాల్లో ప్రదర్శించడానికి విద్యార్థి సంఘాలు ఇప్పటికే నిర్ణయించాయి. ఈ డాక్యుమెంటరీపై కేంద్రం ఐటీ నిబంధనల్లోని ఎమర్జెన్సీ అధికారాలను ప్రయోగిస్తూ నిషేధం విధించిన విషయం విదితమే. ఢిల్లీ, చండీగఢ్, కోల్‌కతా, తిరువనంతపురం తదితర నగరాల్లో ఈ డాక్యుమెంటరీని ఇప్పటికే ప్రదర్శించారు.

హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోం

- అహోబిలం మఠంపై రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో


కర్నూలులోని అహోబిలం ఆలయ వివాదంపై జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. అహోబిలం ఆలయ వ్యవహారాలను నియంత్రించడానికి, నిర్వహించడానికి 'ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఇఒ)ని నియమించాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం రాజ్యాంగంలోని 26(డి)ని ఉల్లంఘించడమేనని, మఠాధిపతి పరిపాలనా హక్కును ప్రభావితం చేయడమేనని హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను వ్యతిరేకిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను స్వీకరించబోమని శుక్రవారం తెలిపింది. ఈ వ్యవహారంలో రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఆదేశాల్లో జోక్యం చేసుకోమని జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ ఎఎస్ ఓకాతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ఆలయం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు జోక్యం చేసుకోవాలని ప్రశ్నిస్తూ ఎపి ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను తోసిపుచ్చింది. మఠం సాధారణ కార్యకలాపాలతో ప్రభుత్వానికి సంబంధం ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. మఠాన్ని ఎందుకు చేజిక్కించుకోవాలను కుంటున్నారని రాష్ట్ర ప్రభుత్వ సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డిని ధర్మాసనం ప్రశ్నించింది. ఆలయాలను, ధార్మిక క్షేత్రాలను ధర్మకర్తలకే వదిలేయాలని, ప్రభుత్వ జోక్యం అవసరం లేదని వ్యాఖ్యానించింది. అహోబిలం మఠంలో ఇఒ నియామకాన్ని తప్పుపట్టిన రాష్ట్ర హైకోర్టు హైకోర్టు తీర్పును సర్వోన్నత న్యాయస్థానం సమర్థించింది.

పొత్తుల కోసం ఎదురుచూస్తున్నాం : నితీష్‌కుమార్

పాట్నా : 2024 లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో భావసారూప్యత కలిగిన పార్టీలతో పొత్తుల కోసం ఎదురుచూస్తున్నట్లు బీహార్ ముఖ్యమంత్రి, జెడి(యు) నాయకులు నితీష్ కుమార్ శుక్రవారం తెలిపారు. కాంగ్రెస్ నిర్వహిస్తున్న భారత్ జోడో యాత్ర పూర్తి కాగానే, పార్టీలతో సమావేశం కోసం ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం బీహార్‌లో కాంగ్రెస్, జెడి(యు) మిత్రపక్షాలుగా ఉన్నాయి. 'భారత్ జోడో యాత్ర ముగింపు కోసం అలాగే, మిగిలిన పార్టీలు (బిజెపి వ్యతిరేక పార్టీలు) సమావేశం కోసం ఎదురుచూస్తున్నాము. ఆ సమావేశంలో లోక్‌సభ ఎన్నికల వ్యూహాన్ని సిద్ధం చేస్తాం' అని చెప్పారు. గతంలో బిజెపి మిత్ర పక్షంగా ఉన్న జెడి(యు) గత ఏడాది ఆగస్టులో బిజెపి నుంచి వేరుపడి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినసంగతి తెలిసిందే.

అయ్యో బాబోయ్.. ఆస్టరాయిడ్

- భూమికి అత్యంత సమీపానికి వచ్చి వెళ్లిన '2023బియు'
- ఇంత దగ్గరగా ఇంతకు ముందెప్పుడూ రాలేదు : నిపుణులు



వాషింగ్టన్ : రెండు రోజుల క్రితం అంతరిక్షంలో ఒక అద్భుతం జరిగింది. భూమికి తృటిలో ఒక పెద్ద ప్రమాదం తప్పింది. అంతరిక్షంలో గురువారం రాత్రి భూమికి కేవలం 3600 కిలోమీటర్ల దూరంలో నుంచి '2023బియూ' అనే ఆస్టరాయిడ్ వెళ్లిపోయింది. భూమికి ఇంత సమీపంగా ఒక ఆస్టరాయిడ్ ఎప్పుడూ రాలేదని అంతరిక్ష శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఒక ట్రక్ పరిమాణంలో ఉండే ఈ ఆస్టరాయిడ్ ఒకవేళ భూమిని తాకితే ఊహించని స్థాయిలో నష్టముంటుంది. భూమిని ఢీకొనేలా '2023బియూ' వచ్చుంటే, దానిపైకి అణ్వాయుధం ప్రయోగించి చిన్న చిన్న ముక్కలుగా చేయాల్సిన పరిస్థితి ఏర్పడేదని శాస్త్రవేత్తలు అంటున్నారు. గత కొద్ది రోజులుగా ఈ ఆస్టరాయిడ్ గమనాన్ని అంతరిక్ష శాస్త్రవేత్తలు గమనిస్తున్నారు. విశ్వం, అంతరిక్షంపై ఆసక్తి కలిగిన కొంతమంది క్రిమియా వద్ద నుంచి బైనాక్యులర్స్, టెలిస్కోపిక్ పరికరాలతో '2023బియు'ను చూసినట్టు వార్తలు వెలువడ్డాయి. దీంతో ఈ ఆస్టరాయిడ్ గమనాన్ని శాస్త్రవేత్తలు నిరంతరం గమనిస్తూ వస్తున్నారు.

'2023బియూ' పరిమాణం 3.5 నుంచి 8.5 మీటర్ల వెడల్పుతో ఉండొచ్చని, ఒకవేళ ఇది భూమిని ఢీకొనే దిశగా వచ్చినా... వాతావరణంలో మండిపోతుందని, అప్పుడు చిన్న చిన్న ముక్కలుగా విడిపోతుందని ఒక శాస్త్రవేత్త వివరించారు. అయితే భూమి నుంచి 900 కి.మీ ఎత్తులో ఉన్న వేలాది శాటిలైట్స్ దెబ్బతినే అవకాశముంది. ఈ ఆస్టరాయిడ్ ఎటుపోతోంది? అన్నదానిపై శాస్త్రవేత్తలు అనేక లెక్కలు వేశారు. నాసా ప్రమాద, ప్రభావ అంచనా వ్యవస్థను ఆధారంగా చేసుకొని అనేకమంది నిపుణులు విశ్లేషించారు. '2023బియూ' ప్రశాంతంగా తన దారిలో పోతుందని అంచనావేశారు. వారు ఊహించినట్టుగానే అది తన కక్ష్యామార్గంలో వెళ్లిపోయిందని తెలుస్తోంది. ఇప్పటివరకూ ఏ ఆస్టరాయిడూ భూమికి ఇంత సమీపంగా రాలేదని, భూ గురుత్వాకర్షణ శక్తి ఆస్టరాయిడ్ గమనాన్ని ప్రభావితం చేసిందని నిపుణులు చెబుతున్నారు.

సింధూ ఒప్పందంపై పాక్‌కు నోటీసులు

న్యూఢిల్లీ : సింధు నదీ జలాల ఒప్పందంపై తాజాగా కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ ఒప్పందాన్ని సవరించుకుందామంటూ పాకిస్థాన్‌కు భారత్ నోటీసు ఇచ్చింది. ఈ విషయాన్ని ప్రభుత్వ అధికారులు శుక్రవారం వెల్లండించారు. సింధు జలాల ఒప్పంద కమిషనర్ల ద్వారా ఈ నెల 25న ఈ నోటీసు పంపినట్లు తెలిపారు. ఈ ఒప్పందం అమలుపై పాక్ మొండి వైఖరి కారణంగానే ఈ నోటీసు పంపించాల్సి వచ్చిందని కేంద్ర ప్రభుత్వ అధికారులు చెప్పారు. సింధూ జలాల ఒప్పంద విషయంలో భారత్, పాకిస్థాన్ మధ్య గత కొన్నాళ్లుగా విభేదాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ నోటీసుతో 90 రోజుల్లోగా భారత్, పాక్ మధ్య చర్చలు నిర్వహించాల్సి ఉంటుంది. గత 62 ఏళ్ల కాలంలో నేర్చుకున్న పాఠాలతో ఈ ఒప్పందాన్ని అప్‌డేట్ చేసుకునేందుకు అవకాశం కలిగినట్లు అవుతుందని చెప్పారు.

అమెరికా ఎయిర్‌ఫోర్స్‌లో తెలుగు వ్యక్తికి కీలక పదవి



రాజాచారి

వాషింగ్టన్: అమెరికా ఎయిర్‌ఫోర్స్‌లో భారత అమెరికన్, తెలుగు వ్యక్తి రాజాచారి కీలక పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. బ్రిగేడియర్ జనరల్ గ్రేడ్ పదవికి రాజాచారిని అధ్యక్షులు జో బైడెన్ నామినేట్ చేశారు. ఈ విషయాన్ని రక్షణ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. అయితే, ఈ దీనిని సెనేట్ ఆమోదించాల్సి ఉంది. అమెరికా ఎయిర్‌పోర్స్‌లో బ్రిగేడియర్ జనరల్ అనేది వన్ స్టార్ జనరల్ ఆఫీసర్ ర్యాంక్ హోదా. దీని తర్వాత మేజర్ జనరల్ హోదా దక్కుతుంది. 45 ఏళ్ల రాజా చారి ప్రస్తుతం అమెరికా వైమానిక దళంలో కల్నల్ హోదాలో ఉన్నారు. అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసాలో వ్యోమగామిగా, క్రూ-3 కమాండర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. గతేడాది అంతరిక్ష యానం కూడా పూర్తి చేసుకున్నారు.రాజాచారి తండ్రి శ్రీనివాస్ వి.చారి హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి. అమెరికా వలస వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. అమెరికా దేశస్థురాలైన పెగ్గీ ఎగ్బర్ట్‌ను వివాహం చేసుకున్నారు. వీరికి రాజాచారి 1977లో జన్మించారు. రాజాచారి అమెరికా ఎయిర్ ఫోర్స్ అకాడమీలో ఆస్ట్రోనాటికల్ ఇంజినీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేశారు. మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఐటీ)లో ఆస్ట్రోనాటిక్స్, ఏరోనాటిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీ పొందారు. 2021లో నాసా, స్పేస్ఎక్స్ సంయుక్తంగా ప్రయోగించిన 'క్రూ-3' మిషన్‌లో రాజాచారి సభ్యులు. ఈ బృందం అంతరిక్ష కేంద్రంలో పరిశోధనలు పూర్తి చేసుకుని గతేడాది మే నెలలో భూమిపైకి తిరిగొచ్చింది. అలాగే నాసా నిర్వహిస్తున్న ప్రతిష్ఠాత్మక 'ఆర్టెమిస్' మిషన్‌లో రాజాచారి సభ్యులుగా ఉన్నారు.

ముఖ్యమంత్రి సమక్షంలోనే ప్రభుత్వంపై స్వామిజీ విమర్శలు



స్వామీజీ నుంచి మైక్ లాక్కుంటున్న సిఎం బొమ్మై

బెంగళూరు: కర్ణాటక ముఖ్యమంత్రి పక్కన కూర్చుని ఒక స్వామీజీ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఈ అనూహ్య పరిణామంతో తీవ్ర అసహనానికి గురైన ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై.. ఆ స్వామీజీ చేతుల్లో నుంచి మైకు లాక్కుని విమర్శలను తిప్పికొట్టే ప్రయత్నం చేశారు. కర్ణాటకలోని మహదేవపురలో జరిగిన ఓ బహిరంగ కార్యక్రమంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. బహిరంగ సభలో కాగినేలె మహాసంస్థాన కనక గురు పీఠాధిపతి ఈశ్వరనందపురి స్వామీజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బెంగళూరులో సరైన మౌలికసదుపాయాలు లేక నగరవాసులు పడుతున్న అవస్థలను సీఎం దృష్టికి తీసుకొచ్చారు. "బెంగళూరులో రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. వరదలు వచ్చినప్పుడు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రజాప్రతినిధులు, అధికారులు కేవలం వర్షాలు పడినప్పుడు మాత్రమే ఇక్కడకు వస్తున్నారు. ఇవన్నీ మేం చాలా కాలంగా చూస్తూనే ఉన్నాం. వర్షాలు పడుతున్నప్పుడు ప్రజలు ఇబ్బందులకు గురవకుండా ఏం చేయాలో అధికారులకు తెలియదా? సీఎం కూడా దీని గురించి గతంలో హామీలు ఇచ్చారు" అంటూ విమర్శలు గుప్పించారు. ఆయన మాటలతో తీవ్ర అసహనానికి గురైన ముఖ్యమంత్రి.. స్వామీజీ మాట్లాడుతుండ గానే మైకును చేతుల్లో నుంచి లాగేసుకున్నారు. స్వామీజీ నుంచి సీఎం మైకును లాక్కుంటున్న వీడియో ప్రస్తుతం సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది.

కాశ్మీర్‌లో జోడోయాత్రకు ఆటంకం

- మిగిలిన రోజుల్లోనైనా భద్రత కల్పించండి : రాహుల్‌గాంధీ



శ్రీనగర్ : భద్రతా వైఫల్యం కారణంగా కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ నేతృత్వంలోని భారత్ జోడోయాత్రకు శుక్రవారం ఆటంకం ఏర్పడింది. షెడ్యూల్ ప్రకారం.. కాశ్మీర్ లోయలో శుక్రవారం 11 కిలోమీటర్లు జోడోయాత్ర చేపట్టాల్సి వుంది. శ్రీనగర్‌కు వెళ్లే మార్గంలోని బనిహాల్‌లో నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు, మాజీ సిఎం ఒమర్ అబ్దుల్లాతో కలిసి రాహుల్ యాత్ర ప్రారంభించారు. పాదయాత్ర ప్రారంభించిన రాహుల్ బుల్లెట్ ప్రూఫ్ వాహనంలో జవహర్ సొరంగం దాటి ఖాజీగుండ్‌లోని లోయలో ప్రవేశించారు. ఆ తరువాత 500 మీటర్లు మాత్రమే నడవగలిగారు. యాత్రలో పాల్గొనేందుకు భారీగా జన సమూహం తరలివచ్చింది. జనాన్ని నియంత్రించేందుకు తగినంతమంది పోలీసు సిబ్బంది లేకపోవడంతో యాత్రను నిలిపివేయాలని, రాహుల్ గాంధీ వ్యక్తిగత భద్రతా సిబ్బంది పట్టుబట్టారు. దీంతో, ఆయన పాదయాత్రను నిలిపివేశారు. వెంటనే ఆయనను ప్రత్యేక వాహనంలో వెనక్కు తీసుకెళ్లాల్సి వచ్చింది. అనంతరం రాహుల్‌గాంధీ మీడియాతో మాట్లాడుతూ భద్రత కల్పించడం జమ్ముకాశ్మీర్ పాలనా యంత్రాంగం బాధ్యత అని అన్నారు. మిగిలిన రోజుల్లోనైనా యాత్రకు భద్రత కల్పిస్తారని ఆశిస్తున్నానని చెప్పారు.

మోర్బీ బ్రిడ్జి కూలడానికి ఒరెవా గ్రూప్‌దే బాధ్యత

గాంధీనగర్ : గుజరాత్‌లో మోర్బీ బ్రిడ్జి కూలిన కేసులో శుక్రవారం 1,262 పేజీల ఛార్జిషీట్‌ను పోలీసులు సిద్ధం చేశారు. పరారీలో ఉన్న ఒరెవా గ్రూప్ ప్రమోటర్, అజంతా మాన్యుఫ్యాక్చరింగ్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ జైసుఖ్ పటేల్‌ను ప్రధాన నిందితుడిగా ఛార్జిషీటులో చేర్చినట్లు పోలీసులు తెలిపారు. బ్రిటీష్ కాలం నాటి మోర్బీ వంతెన మరమ్మతు, నిర్వహణ కాంట్రాక్టును అజంతా బ్రాండ్‌తో గోడ గడియారాల తయారు చేసే కంపెనీ ఒరెవా గ్రూప్‌కు గుజరాత్‌లోని బిజెపి ప్రభుత్వం కట్టబెట్టిన సంగతి తెలిసిందే. పాత కేబుల్స్‌ను మార్చకుండా కొద్దిపాటి మరమ్మతులతో ఒరెవా కంపెనీ 2022 అక్టోబర్ 30న బ్రిడ్జిని ప్రారంభించింది.

JEEVANA జీవన the family

మనసులు దోచిన వన్నెల దొరసాని



జమున...అంటే గుర్తుకువచ్చే పాత్రలతో పాటు ఎన్నో మంచి గీతాలూ ఉన్నాయి. ఆమె కీలకంగా ఆలపించిన పాటలు సంగీత ప్రియుల మనుసుల్లో ఇప్పటికీ ఎప్పటికీ నిలిచి ఉంటాయి. మూగమనసులు చిత్రంలో 'గోదారి గట్టుంది..' పాటలో ఆమె ముఖ కవళికలు, హావభావాలతో పాటకు తగ్గట్టుగా నటించి అభిమానుల దగ్గరయ్యారు. ఈ చిత్రంలోనే 'ముక్కు మీద కోపం..' పాటలో చలాకీ మరదలుగా మెప్పించారు. ధనమా దైవమా చిత్రంలో 'నీ మది చల్లగా..' పాటలో భార్యగా భర్త విశ్రాంతి కోసం తపించే ఇల్లాలిగా కనిపిస్తారు. బొబ్బిలి యుద్ధం చిత్రం 'ముత్యాల చెమ్మ చెక్క...' పాటల్లో చురుకైనా అల్లరి పిల్లగా కనిపించారు. పూజ ఫలము చిత్రంలో ' పగలే వెన్నెల జగమే ఊయల' పాటను స్వయంగా ఆమె ఆలపించినట్లు ప్రేక్షకులను మైమరిపించారు. నటుడు హరనాథ్‌తో నటించిన లేత మనసులు చిత్రంలో 'అందాల ఓ చిలకా అందుకో నా లేఖ' పాటలో అందమైన ప్రియురాలిగా జీవించారు. డి. యోగానంద్ దర్శకత్వంలో 1962లో విడుదలైన 'గులేబకావళి కథ' చిత్రంలో రామారావు, జమున ముఖ్యపాత్రల్లో నటించారు. ఈ చిత్రం ద్వారా సి. నారాయణ రెడ్డి సినీ గేయ రచయితగా తన ప్రస్థానం ప్రారంభించాడు. ఆయన రాసిన 'నన్ను దోచుకుందువటే..' అనే పాట బహుళ ప్రజాదరణ పొందింది. ఇందులో ఎన్టీఆర్‌తో సమానంగా ఆమె అభినయంతో ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారు. ఇంకా మరెన్నో మధురగీతాల్లో తన నాట్య కళా ప్రావీణ్యంతో సినీ ప్రజలకు గుర్తుండిపోతారు.



సంతాపాలు

జమున మరణ వార్త ఎంతో విచారకరం. ఆవిడ బహుభాషా నటి. ఎన్నెన్నో విజయవంతమైన చిత్రాలతో తెలుగు వారి మనసుల్లో చెరగని ముద్ర వేశారు. మహానటి సావిత్రి గారితో ఆవిడ అనుబంధం ఎంతో గొప్పది. ఆవిడ కుటుంబానికి నా ప్రగాఢ సంతాపం.

– చిరంజీవి

జమున గారు చిన్ననాటి నుంచే నాటకాల్లో అనుభవం ఉండటంతో నటనకే ఆభరణంగా మారారు. ఆ రోజుల్లోనే పలు హిందీ సినిమాల్లోనూ నటించి ఔరా అనిపించి అందరి ప్రశంసలు పొందిన బహుముఖ ప్రజ్ఞాశాలి. ఈ రోజున జమున గారు భౌతికంగా మన మధ్యలో లేనప్పటికీ వారి మధుర స్మృతులు ఎల్లప్పుడూ మన మదిలో మెదులుతూనే ఉంటాయి.

– బాలకృష్ణ

లెజెండరీ నటి జమున మృతి చెందడం బాధాకరం. కెరీర్‌లో ఆమె చేసిన ఐకానిక్ పాత్రలు, తెలుగు సినీ పరిశ్రమకు చేసిన సేవలకుగానూ ఆమెను సినీ ప్రేక్షకాభిమానులు ఎప్పటికీ ప్రేమగా గుర్తుంచుకుంటారు.

– దర్శకుడు కె.రాఘవేంద్రరావు

జమున గారి మరణవార్త విని బాధగా ఉంది. ఆమె చేసిన అన్ని ఐకానిక్ పాత్రలు చేశారు. పరిశ్రమకు అపారమైన సహకారం అందించారు. ఆమెను ప్రేమగా గుర్తుంచుకుంటారు.

– మహేష్‌బాబు

దాదాపు 30 సంవత్సరాలు తెలుగు సినీ ఇండస్ట్రీలో మహారాణిలా కొనసాగారు. గుండమ్మ కథ, మిస్సమ్మ లాంటి ఎన్నో మరుపురాని చిత్రాలు, మరెన్నో వైవిధ్యమైన పాత్రలతో మా మనసుల్లో చెరపలేని ముద్ర వేసారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి

– జూనియర్ ఎన్టీఆర్



డా॥రాజారావు గారితో సినినటి జమున, కెమేరామేన్ మాదేటి వెంకటేశ్వరరావు గార్లు తదితరులు

అందం, అభినయాలే నటీమణుల కొలమానంగా కీర్తిస్తున్న చిత్రరంగంలో నిండైన ఆత్మవిశ్వాసంతో మెలిగిన నాయికామణులు చాలా కొద్దిమందే.. అటువంటి వారిలో ఒకరే జమున అలియాస్ జానాబాయ్.. అవకాశాల కోసమో.. పేరు ప్రతిష్టల కోసమో తనను తాను తక్కువ చేసుకోకుండా హేమాహేమామీలతో సైతం తలపడిన ధీరత్వం ఆమెది. వెండితెర సత్యభామగా ప్రేక్షకుల మదిలో చెరగని ముద్రవేసిన ఆమె గురించి ఒక్కమాటలో చెప్పాలంటే ఆత్మాభిమానం ఆమెకు పెట్టని ఆభరణం.. ధీరత్వం, హుందాతనంతో నిండైన వ్యక్తిత్వంతో తెలుగు ప్రేక్షకుల మదిలో ఎప్పటికీ నిలిచేవుంటారు. మొండిఘటం, పెంకిపిల్ల, పొగరుబోతుగా ఎన్నో పాత్రల్లో నటించిన ఆమె పౌరుషం, ధైర్యం కలగలపిన ధీరనాయకిగా వెండితెరపై వెలుగొందారు. రామారావు, నాగేశ్వరరావు, సావిత్రి వంటి మేరునగధీర నటీనటుల సరసన తనకంటూ ప్రత్యేకస్థానం సంపాదించుకున్న ఆమె ప్రస్థానం ప్రజానాట్యమండలి నుంచే మొదలైంది.

ఆత్మ గౌరవం.. ఆమెకు అలంకారం..

కర్ణాటక హంపీ ప్రాంతంలో పుట్టిన జమున అసలు పేరు జానాబాయ్. తండ్రి నిప్పని శ్రీనివాస రావు. తల్లి కౌసల్యాదేవి. తండ్రి వ్యాపారరీత్యా జమున బాల్యంలోనే కుటుంబం దుగ్గిరాలకు చేరింది. భూ పోరాటాలు ఉధృతంగా సాగుతున్న ఆ రోజుల్లో వాడవాడలా ప్రజానాట్యమండలి 'మా భూమి' నాటకం హోరెత్తుతోంది. దుగ్గిరాలలో నిర్వహిస్తున్న ఆ నాటకంలో హీరో చెల్లెలు కమల పాత్రలో జమునకు నటించే అవకాశం వచ్చింది. అంతకు ముందు నుండే నటనపై ఆసక్తి ఉన్న ఆమెకు అడపాదడపా రంగస్థలంపై అభినయించిన అనుభవం ఉంది. అయితే 'మా భూమి' నాటకంలో చేయడం వల్లే తను కలలుగన్న చిత్రసీమలో అవకాశం వచ్చిందని ఆమె చాలా సందర్భాల్లో చెప్పేవారు.

'మా భూమి' నాటకం చూసిన ప్రజానాట్యమండలి వ్యవస్థాపకులు, డాక్టర్ గరికపాటి రాజారావు జమునను వెండితెరకు పరిచయం చేశారు. 'డాక్టర్‌గా సుపరిచితులైన రాజారావు గొప్ప పరోపకారి' అంటూ ఒకానొక సందర్భంలో ఆయన గురించి గొప్పగా చెప్పారు జమున. తన నటనకు ఓనమాలు నేర్పిన ప్రజానాట్యమండలి, రాజారావును చివరిదశ వరకు గుర్తుంచుకోవడం.. ఏ అవకాశం వచ్చినా వాళ్ల గురించి ప్రస్తావించడంలోనే ఆమె వ్యక్తిత్వం అర్థం చేసుకోవచ్చు. ప్రజానాట్య మండలి పున:నిర్మాణానికి ఆమె ఇతోధికంగా సహకారం అందించారు.

రాజారావు దర్శక, నిర్మాణంలో నూతన నటీనటులతో తెరకెక్కిన పుట్టినిల్లు (1952) చిత్రం ఆమె తొలి చిత్రం. అలా 14 ఏళ్లకే సినీరంగ ప్రవేశం చేశారు. మొదటి అవకాశంలోనే హీరోయిన్‌గా వెండితెరకు పరిచయం అయిన జమున దాదాపు 200 చిత్రాల్లో నటించారు. రామారావు, నాగేశ్వరరావుతో ఎన్నో చిత్రాలు చేసిన ఆమె జానపద, పౌరాణిక, సాంఘిక చిత్రాల్లో వైవిధ్యపాత్రలతో తనదైన ముద్రవేశారు. హరనాధ్, కృష్ణతో కూడా తెరను పంచుకున్న ఆమె శోభన్‌బాబుతో 'తహశీల్దార్ గారి అబ్బాయి' అనే ఒక్క చిత్రంలోనే నాయికగా నటించారు.

గడుసుపిల్లగా చాలా సినిమాల్లో కనిపించే జమున వ్యక్తిగత జీవితంలో కూడా ఆవిధంగానే మెలిగేవారు. బాల్యం నుంచే ధైర్యసాహసాలు ఒంటబట్టించుకున్న ఆమె .. తన తల్లి ప్రభావం తనపై ఉందని చెప్పేవారు. 'పండంటి కాపురం' చిత్రంలో రాణీ మాలినీదేవిగా నటించిన ఆమె ఆ పాత్రలో నటించారని చెప్పలేం.. ఏ పాత్ర చేసినా ఆమె నటించారనడం కంటే జీవించేవారని చెప్పవచ్చు.



పుట్టినిల్లు సినిమాలో డా॥రాజారావు గారితో జమున

రెండు దశాబ్దాల పాటు వెండితెరపై రారాణిగా వెలిగిన జమున ... తెలుగు వారికి సత్యభామగా ఎప్పుడూ గుర్తుంటారు. మూగమనసులు, గుండమ్మ కథ, మిస్సమ్మ, ఇల్లరికం, లేత మనుసులు, బంగారు పాప, దొంగరాముడు, చిరంజీవులు, సిపాయి కూతురు, భూకైలాస్, శ్రీకృష్ణ తులాభారం వంటి జనాదరణ చిత్రాలు ప్రస్తావనలో, ప్రాచుర్యంలో ఉన్నంతకాలం ఆమె వెలుగొందుతూనే ఉంటారు.

నిరుపేద కళాకారుల కోసం..



'రంగస్థల వృత్తి కళాకారుల సంఘ' ప్రెసిడెంట్‌గా జమున ఎంతోమంది నిరుపేద రంగస్థల కళాకారులకు ఇళ్ల స్థలాలు ఇప్పించారు. 1972 నుంచి రాష్ట్రమంతా గ్రామగ్రామాలు తిరిగారు. 10 వేల మంది రంగస్థల కళాకారులను కలిసి వారి బాధలు తెలుసుకుని ఆదుకున్నారు. కాకినాడ మాధవపట్నంలో 2000 వేల మంది తోలుబొమ్మలాట కళాకారులకు ఒకే చోట ఇంటి స్థలాలు ఇప్పించారు. పిచ్చుకగుంటలు, బుర్రకథల కళాకారులతో పాటు తెలంగాణలో భాగవాతుల కళాకారుల కోసం కూడా ఇళ్లస్థలాలు ఇప్పించారు. కళారంగంలో రాణించి, పేద కళాకారులను ఆదుకున్న అతికొద్దిమంది నటీనటుల్లో జమున ఒకరిగా నిలిచిన జమునలో సేవాగుణం చూడవచ్చు.

చెక్కు చెదరని ఆత్మవిశ్వాసం

సావిత్రితో అనుబంధం

వెండితెరపై ఎన్నో సినిమాల్లో అక్కాచెల్లెళ్లుగా నటించిన సావిత్రి, జమున నిజ జీవితంలో కూడా అలాగే మెలిగేవారు. సావిత్రి వ్యక్తిగత జీవితం గురించి ఎంతో ఆవేదన చెందేవారు. సావిత్రి చివరి రోజుల్లో కోమాలోకెళ్లి పోయిన తరుణంలో కూడా ఆమెను ఎలాగైనా రక్షించుకోవాలని ఎంతో తపన పడ్డారు. 'నిండైన మనిషిలా ఉండే సావిత్రిని చిక్కి శల్యమైన స్థితిలో చూసి వెక్కివెక్కి ఏడ్చాన'ని ఎన్నో సందర్భాల్లో చెప్పారు జమున. ఆమెలో గొప్ప స్నేహితురాలు కనపడుతుంది.

జమునలో ఎప్పుడూ ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతూ ఉండేది. తనకు తాను ఎంతో గుర్తింపూ గౌరవమూ ఇచ్చుకునేవారు. హీరోలు సెట్‌లోకి వస్తే మిగతా ఆర్టిస్టుల్లాగ లేచి నించునేవారు కాదు. పైగా ఆమెకు కాలి మీద కాలు వేసుకొని కూచోవడం అల వాటు. ఇది కొంతమందికి పొగరుబోతు తనంగా కనిపించేది. ఒకానొక సందర్భంలో అగ్ర హీరోలు రామారావు, నాగేశ్వరరావు జమున ప్రవర్తనపై అభ్యంతరం చెబుతూ... తమ సినిమాల్లో ఆమెకు అవకాశాలివ్వకుండా చేశారు. మూడేళ్లపాటు వాళ్లతో తెరను పంచుకోనివ్వ కుండా చేసినా ఏమాత్రం బెదరకుండా తనకు వచ్చిన అవకాశాలతోనే సినిమాలు చేశారు కాని వారిని క్షమించమని అడగలేదు. 'నా తప్పేమీ లేకుండా.. నా ఆత్మాభిమానాన్ని కించపరుస్తూ మాట్లాడడాన్ని నేను సహించలేదు.. ఆత్మవిశ్వాసంతో ఒక స్త్రీ ఎదుగుతుంటే చాలామంది పురుషులు సహించలేరు. వారు కూడా అలాగే ప్రవర్తించారు. ఆ తరువాత మళ్లీ మేమంతా కలసి చాలా సినిమాలు పనిచేశాం' అంటూ అప్పటి వివాదం గురించి మాట్లాడిన ప్రతిసారీ తనలో ఆత్మాభిమానం తొణికిసలాడుతుంది. అంతటి అవమానాన్ని మర్చిపోయి పెద్దలు చక్రపాణి కుదిర్చిన సయోధ్యతో 'గుండమ్మ కథ' సినిమాలో రామారావు, నాగేశ్వరరావుతో కలసి తెరను పంచుకున్నారు.

తల్లి నుండి సంక్రమించిన సంగీత ప్రావీణ్యంతో 'పెళ్లి రోజుల్లో' చిత్రంలో 'పెళ్లి వారమండి.. ఆడ పెళ్లి వారమండి..' అంటూ సాగే పాటలో పిబి శ్రీనివాస్‌తో కలిసి గాత్రం పంచుకున్నారు. అప్పటి నటీమణుల్లో నటనతో పాటు గాయనిగా ప్రావీణ్యం ఉన్నవారు చాలా కొద్దిమందే. జమునకు హార్మోనియం వాయించటం కూడా బాగా తెలుసు.



పిల్లలు మెచ్చే 'చంద్రుడు చెప్పినకథలు'



బాల్యం అమూల్యం. 'మొక్కై వంగనిది మానై వంగునా' అన్నట్లు పిల్లలు కథల ద్వారా చెప్పేటటువంటి నీతిని తమ భావి జీవితానికి అనువదించుకొని, సక్రమ మార్గంలో నడిచే అవకాశం ఉంటుంది. ఆ కోవలోకి చెందినవే యాడవరం చంద్రకాంత్ గౌడ్ గారు రాసిన 'చంద్రుడు చెప్పిన కథలు.' 64 పేజీల ఈ పుస్తకంలో 35 కథలు ఉన్నాయి. ముఖచిత్రంలో చందమామ ఫొటో పిల్లలతో మాట్లాడుతున్నట్లు ఆకర్షణీయంగా ఉంది.

'అసాధ్యుడు' కథలో పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు అనే జీవిత సత్యాన్ని తెలియజెప్పే ప్రయత్నం చేశారు. కరోనా మహమ్మారి వల్ల ప్రత్యక్ష పాఠాలకు బదులుగా ఆన్లైన్ తరగతుల వలన ఎన్నో నష్టాలు ఉన్నాయన్న విషయాన్ని 'సారు బడికి వస్తా' అనే కథలో ఉదయ్ అనే విద్యార్థి ద్వారా చెప్పారు.

'సాహస బాలుడు' కథలో ప్రాణాలకు తెగించి తోటి విద్యార్థిని కాపాడాలి. పరోపకారం చేయాలి అని నేటి విద్యార్థులకు సమయస్ఫూర్తిని తెలియజేయడం అభినందనీయం. 'గురుదక్షిణ' కథలో తన దగ్గర పాఠాలు నేర్చుకున్న విద్యార్థులు ప్రయోజకులైతే గురువు పొందే ఆనందం వెలకట్టలేనిది అనే సందేశాన్ని తెలుసుకుంటాం. 'నిజాయితీ' కథలో పరుల సొమ్ము పాము వంటిదనే నీతి గ్రహిస్తాం. తన తప్పు తాను తెలుసుకోవడమే నిజమైన పశ్చాత్తాపమని 'మంచి కొడుకు' కథలో, చెట్లను పెంచితే అవి ఆరోగ్యాన్ని పంచుతాయని 'చెట్ల ప్రేమికుడు' కథలో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేది గురువే అని 'ఆచార్యదేవోభవ' లో అందించడం నేటి పిల్లలకు మార్గదర్శకాన్ని చూపే విధంగా ఉన్నాయి.




'ఆదర్శవంతుడు'లో ఉపాధ్యాయులు విద్యార్థులకు మంచి ప్రేరణలు ఇస్తారు. రక్త సంబంధాల కన్న మానవ సంబంధాలు మిన్న అనే సత్యాన్ని 'మానవత్వం' కథలో ఆవిష్కరించారు. నేటి కాలంలో ఆడపిల్ల చదువు అవనికే అందం అనే సందేశాన్ని 'ఆడపిల్ల' కథ ద్వారా తెలిపాడు. ఇలా రచయిత రాసిన ప్రతి కథ ఆణిముత్యంగా చెప్పవచ్చు.

– పి. స్నేహలత, 10వ తరగతి, జెడ్పీ స్కూలు, రాయిలాపూర్, మెదక్ జిల్లా.

నేను గీసిన బొమ్మ

ఎస్ ప్రణీత, 4వ తరగతి, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (బస్టాండ్), గోనెగండ్ల గ్రామం, కర్నూలు జిల్లా.





పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

సరిలేరు సానియాకెవ్వరు

• ముగిసిన గ్రాండ్‌స్లామ్ కెరీర్ • భారత టెన్నిస్ ముఖచిత్రం

భారత క్రీడారంగంలో ఆమెది ప్రత్యేక ప్రస్థానం. ఆటతో పాటు సమాజం ఛత్రాల సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొని నిలిచిన చరిత్ర ఆమెది. మేరీకోమ్, సైనా నెహ్వాల్, పి.వి సింధు కంటే ముందే భారత క్రీడారంగ ముఖచిత్రంగా నిలిచిన సానియా మీర్జా గ్రాండ్‌స్లామ్ కెరీర్‌ను గ్రాండ్‌గా ముగించింది. 36 ఏండ్ల సానియా మీర్జా ఆస్ట్రేలియన్ ఓపెన్‌తో గ్రాండ్‌స్లామ్ కెరీర్‌ను ముగించింది.



ప్రజాశక్తి :

'నేను ఇప్పుడు కంటతడి పెడితే అవి ఆనందభాష్పాలే, బాధ నుంచి వచ్చినవి కావు' 2023 ఆస్ట్రేలియన్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్స్ అనంతరం సానియా మీర్జా వ్యాఖ్యలు ఇవి. ఎక్కడైతే గ్రాండ్‌స్లామ్ కెరీర్ మొదలుపెట్టిందో, అక్కడే గ్రాండ్‌గా గ్రాండ్‌స్లామ్ కెరీర్‌ను ముగించింది సానియా మీర్జా. 36 ఏండ్ల సానియా మీర్జా ఆస్ట్రేలియన్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ రన్నరప్ ట్రోఫీతో వీడ్కోలు పలికింది. టెన్నిస్ చరిత్రలో చిరస్మరణీయ ఘట్టాలకు వేదికగా నిలిచిన ఆస్ట్రేలియన్ ఓపెన్ ఐకానిక్ కోర్టు భారత క్రీడా దిగ్గజం సానియా మీర్జా వీడ్కోలుకు వేదికైంది.

ఆమె దారి రహదారి : భారత్‌లో మహిళలు క్రీడల్లో రాణించాలంటే, తొలుత కుటుంబం, ఆ తర్వాత సమాజం.. ఆ తర్వాతే ప్రత్యర్థులతో పోటీ పడాలి. క్లిష్టమైన సవాళ్ల నడుమ ఆ పని చేసింది సానియా మీర్జా. మధ్యతరగతి ముస్లిం కుటుంబ నేపథ్యం నుంచి ఎదిగిన సానియా మీర్జా ప్రస్థానం పూల బాట కాదు. టెన్నిస్ కోర్టులో రాకెట్ పట్టడానికి ముందే ఓ యుద్ధం చేసిన సానియా మీర్జా.. సుదీర్ఘ కెరీర్‌లో ఎన్నడూ ఆత్మవిశ్వాసం కోల్పోలేదు. ఎంసీ మేరీకోమ్, సైనా నెహ్వాల్, పి.వి సింధుల కంటే ముందుగానే భారత క్రీడా రంగ ముఖచిత్రంగా, ప్రత్యేకించి మహిళా అథ్లెట్లకు సూపర్‌స్టార్‌గా నిలిచింది సానియా మీర్జా. సంప్రదాయాలు, కట్టుబాట్లను దాటుకుంటూ సరికొత్త పంథాలో నడిచిన సానియా మీర్జా.. భారత క్రీడా రంగంలో మహిళా అథ్లెట్లకు దారి చూపిన బాటసారి. భారత్‌కు అసమాన విజయాలు సాధించినా, ఆమె దేశభక్తి ప్రశ్నార్థకమైంది. పాకిస్థాన్ క్రికెటర్‌తో వివాహంతో వ్యక్తిగత జీవితంపైనా విమర్శలు వెల్లువెత్తాయి. అయినా, సానియా మీర్జా అధైర్యపడలేదు. ఎంచుకున్న మార్గంలో విజయవంతమైన సానియా మీర్జా.. తనెంటో సాధించిన ఘనతలు, రికార్డులతోనే విమర్శలకు సరైన సమాధానం ఇచ్చింది. షోయబ్ మాలిక్‌తో ఓ బిడ్డకు జన్మనిచ్చిన సానియా మీర్జా.. ఎవరూ ఊహించని విధంగా టెన్నిస్‌లో రీ ఎంట్రీ ఇచ్చింది. తనయుడితోనే నిరుడు ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీఫైనల్లో పోటీపడిన సానియా మీర్జా.. ఈ ఏడాది కుమారుడు కండ్ల ముందు గ్రాండ్‌స్లామ్ టైటిల్ పోరులో తలపడింది. ఆ భావోద్వేగం సానియా మీర్జాలో స్పష్టంగా కనిపించింది.

టెన్నిస్ ముఖచిత్రం : భారత టెన్నిస్ ముఖచిత్రం సానియా మీర్జా. కెరీర్ తొలినాళ్లలోనే సంచలన విజయాలు సాధించిన సానియా మీర్జా.. అటు సింగిల్స్, ఇటు డబుల్స్ విభాగాల్లో తనదైన ముద్ర వేసింది. సొంతగడ్డ హైదరాబాద్‌లో తొలిసారి (2005) డబ్ల్యూటీఏ టైటిల్ సాధించిన సానియా మీర్జా.. అదే ఏడాది యుఎస్ ఓపెన్‌లో నాల్గో రౌండ్‌కు చేరుకుని చరిత్ర సృష్టించింది. రమేశ్ కృష్ణన్ (1987) తర్వాత మరో భారత టెన్నిస్ ప్లేయర్ న్యూయార్క్‌లో రెండో వారం రాకెట్ పట్టలేదు. గ్రాండ్‌స్లామ్ నాల్గో రౌండ్‌కు చేరిన భారత తొలి మహిళా అథ్లెట్‌గా సానియా నిలిచింది. 2005 మెల్‌బోర్న్‌లో ప్రపంచ టెన్నిస్ దిగ్గజం సెరెనా విలియమ్స్‌తో ముఖాముఖి పోరు సానియా మీర్జా కెరీర్‌లో హైలైట్. ఆస్ట్రేలియన్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ సెమీఫైనల్ అనంతరం సానియా ఈ విషయం వెల్లడించింది. 'నా వరకు మెల్‌బోర్న్‌లో 18 ఏండ్ల వయసులో సెరెనా విలియమ్స్‌తో ఆడిన మ్యాచ్ అత్యంత ప్రత్యేకం. ఆ మ్యాచ్‌లో నేను 1-6, 4-6తో ఓటమి చెందినా.. నాలో దృఢమైన ఆత్మవిశ్వాసం నింపిన సమరం అది. ఓ సాధారణ భారతీయ అమ్మాయిగా నాపై నాకు విశ్వాసం కలిగించిన మ్యాచ్ అది' అని సానియా తెలిపింది.

అసమాన విజయాలు : భారత టెన్నిస్‌లో సానియా మీర్జా ఇప్పటికీ టాప్ క్రీడాకారిణి. డబ్ల్యూటీఏ సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో (2017) నం.27గా నిలిచింది సానియా. సింగిల్స్‌కు దూరమైన పదేండ్లలో సైతం సానియా రికార్డు చెక్కుచెదరలేదు. ఇక మహిళల డబుల్స్ సర్క్యూట్‌లో సానియా మీర్జా ప్రపంచంలోనే మేటీ అథ్లెట్లలో ఒకరుగా నిలిచింది. ఆరు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు సాధించిన సానియా మీర్జా.. డబుల్స్ విభాగంలో 43 టూర్ టైటిళ్లు సొంతం చేసుకుంది. మహిళల డబుల్స్ నం.1 ఏకధాటిగా 91 వారాల పాటు కొనసాగింది. ప్రొఫెషనల్‌గా, పర్సనల్‌గా ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుని, పరిస్థితులను పట్టించుకోకుండా ఎంచుకున్న మార్గంలో నడిచిన సానియా మీర్జా.. కెరీర్‌ను ముగించటంలోనూ అదే స్టయిల్ చూపించింది. ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ రన్నరప్ టైటిల్‌తో గ్రాండ్‌స్లామ్ కెరీర్‌ను ఘనంగా ముగించింది. వచ్చే నెల దుబాయ్‌లో డబ్ల్యూటీఏ 1000 ఈవెంట్‌తో సానియా మీర్జా అంతర్జాతీయ కెరీర్‌కు పూర్తిగా వీడ్కోలు పలుకనుంది.

ఫైనల్లో అమ్మాయిలు

- సెమీస్‌లో కివీస్‌పై ఏకపక్ష విజయం
- ఐసిసి అండర్-19 టీ20 ప్రపంచకప్

జొహనెస్‌బర్గ్ : అమ్మాయిలకు ఎదురులేదు. సమిష్టి ప్రదర్శన, ఏకపక్ష విజయాలతో ఐసిసి మహిళల అండర్-19 టీ20 ప్రపంచకప్‌లో టీమ్ ఇండియా అండర్-19 జట్టు ఫైనల్లోకి చేరుకుంది. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో న్యూజిలాండ్ అండర్-19 అమ్మాయిలపై షెఫాలీ వర్మ సేన అదిరే విజయం నమోదు చేసింది. 108 పరుగుల లక్ష్యాన్ని మరో 34 బంతులు మిగిలి ఉండగానే ఛేదించిన భారత్ అమ్మాయిలు 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించారు. ఆదివారం జరిగే ఫైనల్లో భారత్ టైటిల్ కోసం పోటీపడనుంది. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ అండర్-19 స్పిన్నర్ పర్శవి చోప్రా (3/20) మాయకు 107/9 పరుగులే చేసింది. ప్లిమర్ (35), ఇసబెల్ల (26) రాణించటంతో కివీస్ వంద పరుగులు చేసింది. స్వల్ప లక్ష్యాన్ని భారత్ 14.2 ఓవర్లలోనే ఊదేసింది. ఓపెనర్ శ్వేత షెరావత్ (61 నాటౌట్, 45 బంతుల్లో 10 ఫోర్లు) ధనాధన్ అర్ధ సెంచరీతో దంచికొట్టింది. సౌమ్య తివారి (22) రాణించింది. 3 వికెట్లతో మాయ చేసిన పర్శవి చోప్రా 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకుంది.



ట్రోఫీలతో స్టెఫాని, రాఫేల్.. సానియా, బోపన్న జంట

రన్నరప్ సానియా జోడీ

ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్

మెల్‌బోర్న్ : భారత టెన్నిస్ దిగ్గజం, మహిళల డబుల్స్ మాజీ వరల్డ్ నం.1 సానియా మీర్జా ఆస్ట్రేలియా ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ రన్నరప్‌గా నిలిచింది. భారత వెటరన్ ఆటగాడు రోహన్ బోపన్న జంటగా మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్‌పై కన్నేసిన సానియా మీర్జా.. శుక్రవారం ఉదయం జరిగిన ఫైనల్లో వరుస సెట్లలో పోరాడి ఓడింది. బ్రెజిల్ జంట స్టెఫాని, రఫేల్ మాటోస్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. 6-7(2-7), 2-6తో సానియా, బోపన్నలు ఫైనల్లో పోరాడి ఓడారు. తొలి సెట్‌ను టైబ్రేకర్‌లో కోల్పోయిన సానియా, బోపన్నలు రెండో సెట్‌లో అంచనాలను అందుకోలేదు. 4 ఏస్‌లు, 2 బ్రేక్ పాయింట్లు సాధించిన సానియా, బోపన్నలు టైటిల్ ముంగిట నిరాశపరిచారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68